వి లేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :91 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 21 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## లోకేష్ రాజీనామా చేయాల్సిందే!

- స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇచ్చిన తర్వాత జీవోలు మారుస్తారా?
- ఇందులో మతలబు ఏమిటి
- అందుకే తమ హయాంలో నిర్వహించిన గ్రూప్-1పై తప్పుడు ఆరోపణలు
- డీఎస్సీ అక్రమాలు, గ్రూప్-1 నియామకాలపై సీబీఐ విచారణకు సిద్ధమా
- సీఎం చంద్రబాబుకు వైయస్ జగన్ మోహన్ రెడ్డి సవాల్

**తాడేపల్లి**

"జీవో నంబర్ 4, జీవో నంబర్ 47 ద్వారా గేట్లు ఎత్తారు. పోటీ పరీక్ష అవసరం లేకుండా నియామకాలకు మార్గం తెరిచారు. స్పోర్ట్స్ కోటాలో దాదాపు 372 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. రిక్రూట్‌మెంట్ పూర్తయిన తర్వాత జీవోలు 23, 56 ద్వారా మళ్లీ ఆ గేట్లు మూసేశారు. ఉద్యోగాలు ఇచ్చిన తర్వాత జీవోలు ఎందుకు వెనక్కి తీసుకున్నారు?" అని మాజీ ముఖ్యమంత్రి- వివరాలు 2లో..

# దక్షిణాది ప్రగతికి సమష్టి అడుగులు

- రాష్ట్రాల మధ్య సహకారంతోనే వికసిత్ భారత్ లక్ష్యం
- 2047 నాటికి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దక్షిణాది రాష్ట్రాలు
- ఏపీ పునర్విభజన చట్టంలో అపరిష్కృత అంశాలపై తక్షణ నిర్ణయం
- 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు



**మహాబలిపురం**

రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరస్పర సహకారం, సమన్వయంతో పరిష్కరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలు కలసికట్టుగా ముందుకు సాగితే భారతదేశ అభివద్ధికి మరింత బలమైన చోదకశక్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. 2047 నాటికి దక్షిణ భారత్ 10 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సామర్థ్యం ఉందన్నారు. తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. 24 అంశాలతో కూడిన ఎజెండాపై సమావేశంలో చర్చించారు. ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివద్ధి గురించి ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య వివరాలు 2లో..

## విద్యార్థుల కంటే మంత్రుల కుక్కలకే మెరుగైన సౌకర్యాలు

- వారి పిల్లలను ప్రభుత్వ స్కూళ్లకే పంపాలి : దీప్కే
- మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దీప్కే డిమాండ్
- పాఠశాలల దుస్థితికి ప్రజాప్రతినిధులు, మంత్రులే బాధ్యత వహించాలి





## నిధుల్లో కేవలం 0.01% మాత్రమే ఖర్చు

- PM CARES నిధిపై ఖర్గే ప్రశ్నలు
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ. 87.85 లక్షలు మాత్రమే ఖర్చు చేశారని ఖర్గే వెల్లడి
- అత్యవసర పరిస్థితుల కోసం ఏర్పాటు చేసిన నిధిలో వేల కోట్ల రూపాయలు ఎందుకు మూలుగుతున్నాయని ప్రశ్న





# రాష్ట్రాల జల వివాదాలకు చర్చలే శరణ్యం

- ఏళ్ల తరబడి వివాదాలు కొనసాగిస్తే ఎవరికీ ప్రయోజనం ఉండదు
- న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లు ఈ సమస్యలను పరిష్కరించలేవు
- సెప్టెంబర్‌లో 4 రాష్ట్రాల సీఎంలతో ఢిల్లీలో భేటీ నిర్వహిస్తాం
- సదరన్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**హైదరాబాద్/చెన్నై /అమరావతి**

దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి దేశ ప్రగతికి మూలాధారమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. జలవివాదాలను న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లు పరిష్కరించలేవని.. పరస్పర సంప్రదింపులతోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుకోవడం తప్పు కాదని.. అయితే ఆ నెపంతో నీటిని సముద్రంలోకి వదిలేస్తూ ఏళ్ల తరబడి వివాదాలు కొనసాగిస్తే ఏ ఒక్కరికీ ప్రయోజనం ఉండదన్నారు. అందుకే తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక మధ్య నెలకొన్న జల వివాదాలపై చర్చించడానికి సెప్టెంబర్ తొలి వారంలో ఢిల్లీలో ఆయా రాష్ట్రాల సీఎంలతో సమావేశం నిర్వహిస్తామని అమిత్ షా ప్రకటించారు. తమిళనాడులోని మహాబలిపురంలో గురువారం జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ భేటీలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క (సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లడంతో), తమిళనాడు సీఎం సి.జోసెఫ్ విజయ్, ఏపీ సీఎం చంద్రబాబు, కర్ణాటక సీఎం డి.కె.శివకుమార్, వివరాలు 2లో..



## మోహన్ భగవత్‌కు దౌత్య మర్యాదలు వద్దు

- అమెరికా కమిషన్ సంచలన వ్యాఖ్యలు
- ఆర్ఎస్ఎస్‌పై ఆంక్షలు విధించాలని యూఎస్సీఐఆర్ఎఫ్ డిమాండ్
- మోహన్ భగవత్ అమెరికా పర్యటనకు ముందు ప్రతిపాదన
- ఆర్ఎస్ఎస్ నేతలకు దౌత్య మర్యాదలు వద్దన్న కమిషన్
- మత స్వేచ్ఛ ఉల్లంఘనలపై ఆర్ఎస్ఎస్‌పై ఆరోపణలు
- గతంలోనూ భారత్‌పై యూఎస్సీఐఆర్ఎఫ్ తీవ్ర నివేదిక

## జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదు



- మాజీ సీఎం జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదంటూ ఎద్దేవా
- గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ వేయకపోవడానికి ఇదే కారణం
- అసెంబ్లీ చర్చ నుంచి జగన్ పారిపోతున్నారని ఆరోపణ
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లోకేశ్ పోస్ట్

## సీబీఎస్ఈ 3 భాషల విధానం అమలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

- ప్రణాళికను పునఃపరిశీలించాలని బోర్డుకు ఆదేశం
- మూడు భాషల విధానం అమలుపై సుప్రీంకోర్టు అభ్యంతరం
- ఈ విధానం అమలుపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశం

మూడు భాష విద్యార్థులపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందన్న ధర్మాసనం



# దక్షిణాది ప్రగతికి సమష్టి అడుగులు

-మొదటిపేజీ తరువాయి

పరస్పర సహకారం సాధించటమే లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ రైలు కారిడార్‌ను అభివద్ధి చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. అమరావతి--బెంగళూరు--చెన్నై నగరాలను అనుసంధానించే ఈ మార్గం మూడు రాష్ట్రాల మధ్య ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతం ఇస్తుందని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టుల ఏర్పాటు, దక్షిణ గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం చేయడం, యూనివర్సిటీలు, ఇతర స్కిల్లింగ్ సంస్థలతో కలిసి సంయుక్త నైపుణ్యాభివద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రకతి విపత్తుల సమయంలో ఏ రాష్ట్రం ఒంటరిగా ఉండకుండా పరస్పర సహాయానికి ప్రత్యేక విపత్తు నిర్వహణ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదించారు. దక్షిణాది ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఉత్తర భారతదేశంలోని ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మధురై, రామేశ్వరం, మైసూరు వంటి ప్రాంతాలను వారణాసి, అయోధ్య, చార్ ధామ్ ప్రాంతాలతో అనుసంధానించడం ద్వారా దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రోత్సాహం కల్పించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి ప్రతిపాదన చేశారు. దేశ స్థూల ఉత్పత్తిలో దక్షిణాది ఐదు రాష్ట్రాల వాటా ప్రస్తుతం 31 శాతంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. 2047 నాటికి భారత్ 30--35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు. ఏపీ 2.4 ట్రిలియన్ డాలర్లు తమిళనాడు 2.6, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని సమష్టిగా దక్షిణ భారత్ లోని రాష్ట్రాలన్నీ 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని ముఖ్యమంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజనకు సంబంధించిన పెండింగ్ అంశాలను చంద్రబాబు సమావేశం దష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు



గడిచినా షెడ్యూల్ 9, 10లోని సంస్థల విభజన పూర్తికాలేదని పేర్కొన్నారు. ఆస్తులు, అప్పులు, సంస్థల విషయంలో సమ న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 66 కింద ఉన్న అంశాలపై కేంద్ర నిర్ణయం కోసం గడచిన 9 ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని అన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 56లోని సమస్యలు, వనరుల లోటు, ఆర్థిక భారానికి సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. ఏపీ అభివద్ధిలో కేంద్రం అందిస్తున్న సహకారానికి చంద్రబాబు కతజ్ఞతలు తెలిపారు. హామీ ఇచ్చిన 11 జాతీయ సంస్థల్లో 10 ఇప్పటికే ఏర్పాటు కావడం సంతోషదాయకమని అన్నారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి నిర్మాణంలో కేంద్ర సహకారం కీలకమన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్ అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించిన కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. నీటి వనరులు, పచ్చదనం, జీవన ప్రమాణాలు, కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలను దష్టిలో ఉంచుకుని నూతన రాజధాని నిర్మాణం చేస్తున్నామని సీఎం వివరించారు. చట్టంలోని షెడ్యూల్--13 కింద ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలని సీఎం కోరారు. విశాఖ--చెన్నై పారిశ్రామిక కారిడార్, మూడు విమానాశ్రయాల అభివద్ధి, కొత్త రాజధానికి రైలు అనుసంధానం వంటి పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దుగరాజపట్నం పోర్టు, బీపీసీఎల్ రిఫైనరీ, విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు, కడపలోని జిందాల్ స్టీల్ కు రైలు అనుసంధానంపై అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేరళ సీఎం వి.డి. సతీషన్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్ నాథన్, అండమాన్ నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ డి.కె.జోషి సహా ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.


# రాష్ట్రాల జల వివాదాలకు చర్చలే శరణ్యం

-మొదటిపేజీ తరువాయి

కేరళ వి.డి.సతీశన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### కృష్ణా జలాల వాడకానికి అనుమతించాలి: కర్ణాటక సీఎం

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 2013లో కృష్ణా జలాల పంపిణీపై తీర్పును ప్రకటించగా, ఇంకా ఆ తీర్పును నోటిఫై చేయలేదని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. 10 నిమిషాల్లో జరగాల్సిన పని 13 ఏళ్లు గడిచినా పరిష్కారం కాలేదని, ట్రిబ్యునల్ తీర్పును నోటిఫై చేయకపోయినా..ఆ తీర్పులో జరిపిన కేటాయింపుల ఆధారంగా కృష్ణా జలాలను వాడుకోవడానికి అనుమతించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నీటి కేటాయింపులు లేకుండా తెలంగాణ నిర్మిస్తున్న పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకోవాలని ఆయన కోరగా చర్చలతో ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని అమిత్‌షా సూచించారు.



### పోలవరం నుంచే గోదావరి--కావేరి అనుసంధానం

పోలవరం ప్రాజెక్టు నుంచే గోదావరి--కావేరి అనుసంధానం చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు కోరారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు వివాదాన్ని పరిష్కరించుకోవాలని కేంద్ర మంత్రి అమిత్ షా సూచించగా అన్ని ప్రాజెక్టులపై చర్చించి ఏకాభిప్రాయానికి వద్దామని చంద్రబాబు సూచించారు. పాలమూరు--రంగారెడ్డి, తుమ్మిడిహెట్టి, గోదావరి--కావేరి అనుసంధానం ప్రాజెక్టులతోపాటు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును నోటిఫై చేసే అంశంపై సెప్టెంబర్‌లో ఢిల్లీలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర సీఎంలతో సమావేశం నిర్వహిస్తామని ఈ సందర్భంగా అమిత్ షా ప్రకటించారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

### ఏపీ--తెలంగాణ విభజన అంశాలపై..


ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తులు, అప్పుల విభజన, ఇతర పెండింగ్ సమస్యలను కేంద్ర హోంశాఖ సంప్రదింపులతో త్వరలోనే పరిష్కరించుకోవడానికి రెండు రాష్ట్రాల ప్రతినిధులు సమ్మతించారు.

# కొత్త రిజర్వేషన్లతో ఎన్నికలు

**విజయవాడ :** ఏపీలో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ఏపీ ప్రభుత్వం బుధవారం నాడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలంటూ జీవో జారీ చేసింది. దాంతో ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 87 మునిసిపాలిటీ పాలక వర్గాల గడువు ఇప్పటికే పూర్తయింది. మరో 13 పాలకవర్గాల గడువు నవంబర్‌తో ముగియనుందని అధికారులు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు నిర్వహణకుగానూ ఏపీ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం చేసుకుంటోంది.కోర్టు కేసుల కారణంగా రాష్ట్రంలోని మరో 23 మున్సిపాలిటీలో ఎన్నికలు వాయిదా వేశారు. అర్బన్ మున్సిపాలిటీలు, పట్టణాల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్‌తోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇటీవల ఆమోదించిన బీసీ రిసర్వేషన్‌లు అమలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యేక సమగ్ర సవరణ తుది జాబితాలతో కాకుండా 2025 నాటి ఓటర్ల జాబితాల ఆధారంగానే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. అక్టోబరు 3న తుది జాబితాలు విడుదలయ్యే వరకు వేచి ఉంటే మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరులోనే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తుండటంతో, ఓటర్ల జాబితాల రూపకల్పనకు ాఇఅ నోటిఫికేషన్ జారీ చేసింది. మున్సిపాలిటీల్లో సెప్టెంబర్ 3 నాటికి, పంచాయతీల్లో ఆగస్టు 17 నాటికి ఓటర్ల జాబితాల ప్రచురణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ప్రక్రియను ఆగస్టు 21 నుంచి 31 వరకు పూర్తి చేయనున్నారు. అదనపు బ్యాలెట్ బాక్సుల సేకరణతో పాటు 45 రోజుల్లోగా సిబ్బంది శిక్షణ ప్రక్రియను పూర్తి చేసేలా ఈసీ ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది.

### 1986 తర్వాత డైరక్ట్‌ఎలక్షన్స్

ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. దీనిద్వారా రాష్ట్రంలో మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం లభించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పరోక్ష ఎన్నికల విధానంలో మార్పులు తీసుకువస్తూ ప్రభుత్వం ఈ చట్ట సవరణను చేపట్టింది. ఈ బిల్లును పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బుధవారం నాడు సభలో ప్రవేశపెట్టారు. శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల విధానానికి సంబంధించి కొన్ని చారిత్రక అంశాలను వెల్లడించారు. 1986 వరకు పరోక్ష ఎన్నికలు జరగగా, ఆ తర్వాత 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికల విధానం అమల్లో ఉండేదని గుర్తుచేశారు. అయితే 2005 నుంచి పరోక్ష ఎన్నికలు సాగుతున్నాయని, ప్రస్తుత సవరణ ద్వారా మళ్లీ ప్రత్యక్ష ఎన్నికల విధానానికి అవకాశం వచ్చిందన్నారు. ప్రజలు నేరుగా తమ నాయకుడిని ఎన్నుకోవడం వల్ల ఆ పదవుల్లో ఉన్నవారికి నమ్మకమైన ప్రజామోదం లభిస్తుందన్నారు. కౌన్సిలర్లు లేదా కార్పొరేటర్లపై ఆధారపడాల్సిన అవసరం ఉండకపోవడం వల్ల మేయర్, చైర్మన్లపై వారి అనవసర ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల వేగవంతమైన నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం దక్కుతుందని, నగరాలు, పట్టణాలలో అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేయవచ్చని మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి మౌలిక వసతుల కల్పనలో దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం సాధ్యమవుతుంది అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం సాధించి అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ఇది తోడ్పడుతుందని చెప్పారు.నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు పరిశ్రమలు, పర్యాటక రంగాలను ప్రోత్సహించేందుకు ప్రత్యక్షంగా ఎన్నికైన మేయర్ లేదా చైర్మన్‌కు పూర్తి వెసులుబాటు ఉంటుందని మంత్రి నారాయణ వివరించారు. ప్రత్యక్ష ఎన్నికల వల్ల అనవసర రాజకీయ ప్రభావం తగ్గి, ప్రజల నుంచి నేరుగా ఎన్నికైన నేతలు పట్టణాభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి సారిస్తుందన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సానుకూల ప్రయోజనాలన్నింటినీ దృష్టిలో ఉంచుకునే చట్ట సవరణ తెచ్చామని వివరించడంతో, బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. దాంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష ఎన్నికల విధానంలో జరగనుంది.



## లోకేష్ రాజీనామా చేయాల్సిందే!

-మొదటిపేజీ తరువాయి

వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై ప్రశ్నిస్తే కూటమి ప్రభుత్వం గింజుకుంటోందే తప్ప.. తప్పును ఒప్పుకునే పరిస్థితిలో లేదని వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. డీఎస్సీ అక్రమాలపై వైయస్‌ఆర్‌సీపీ పోరాటం చేస్తుండటంతోనే తమ హయాంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్--1 నియామకాలపై కూటమి ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తోందని ధ్వజమెత్తారు. డీఎస్సీ, గ్రూప్--1 వ్యవహారాల్లో వాస్తవాలు, అధికారిక రికార్డులు, కోర్టు ఆదేశాలను ప్రజల ముందుంచేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈ అంశాలపై ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. జగన్ మోహన్ రెడ్డి ఏమన్నారంటే.. ఈరోజు ప్రధానంగా డీఎస్సీ అంశంపై మాట్లాడుతున్నాను. ఈ అంశంపై ఇటీవల అసెంబ్లీలో సుదీర్ఘమైన అబద్ధాలతో కూడిన ప్రసంగాలు చేశారు. వాటికి సమగ్రంగా సాక్ష్యాలు, ఆధారాలతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.' "పరీక్ష ప్రశ్నల తయారీకి ఒక వ్యక్తినే పెట్టారు. పరీక్ష నిర్వహణ కార్యక్రమాన్ని కూడా అదే వ్యక్తికి అప్పగించారు. ఏపీ డీఎస్సీ నియామకాల చరిత్రలో, ఏపీ పీఎస్సీ నియామకాల చరిత్రలో ఈ రెండు బాధ్యతలను ఒకే వ్యక్తికి అప్పగించిన సందర్భం ఇంతవరకు లేదు. ఇలా చేయడం లీకేజీకి స్వయంగా ద్వారాలు తెరిచినట్టే." "డిజిటల్ మూల్యాంకనాన్ని హైకోర్టు ఆదేశాల మేరకు పక్కన పెట్టారు. మాన్యువల్ మూల్యాంకనం చేశారు. ఆ మార్కుల ఆధారంగానే ఇంటర్వ్యూలు నిర్వహించి రిక్రూట్‌మెంట్ పూర్తి చేశారు. 165 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. నాలుగేళ్లుగా వాళ్లు ఉద్యోగాలు చేస్తున్నారు. ఇప్పుడు నాలుగేళ్ల తర్వాత మళ్లీ వాళ్లపై విషప్రచారం చేస్తున్నారు."
"టీవీ ఫుటేజీలు ఉన్నాయి. కేంద్ర ఫోరెన్సిక్ ప్రయోగశాల నివేదికలు ఉన్నాయి. సిట్ నివేదిక ఉంది. ఎగ్జామినర్లను విచారించారు. వారితో చేతిరాత పరీక్షలు కూడా నిర్వహించారు. ఓఎంఆర్ మూల్యాంకన స్లిప్పుల్లో మార్పులు, చేర్పులు లేవు. జవాబు పత్రాల్లో కూడా మార్పులు జరగలేదు. అలాంటప్పుడు డీఎస్సీపై ఇంకా ఈ ప్రచారం ఎందుకు?"
"మరింత దిగజారి 2018లో ఏపీపీఎస్సీ గ్రూప్--1 భర్తీపై తప్పుడు ప్రచారం మొదలుపెట్టారు. 163 మంది ఉన్నత ఉద్యోగుల జీవితాలను అతలాకుతలం చేయాలని చంద్రబాబు నాయుడు టార్గెట్‌గా పెట్టుకుని వ్యవహరిస్తున్నారు. దీనికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందు పెట్టాల్సిన అవసరం ఉంది."
"2019 ఎన్నికలకు కేవలం 76 రోజుల ముందు గ్రూప్--1 నోటిఫికేషన్ ఇచ్చింది చంద్రబాబు ప్రభుత్వం. ఆ నోటిఫికేషన్ మేము ఇచ్చింది కాదు. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ అది." "2019 మే 26న గ్రూప్--1 ప్రిలిమ్స్ పరీక్ష పూర్తయింది. మే 30న మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అంటే మా ప్రభుత్వం రాకముందే ప్రిలిమ్స్ నిర్వహించారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రిలిమ్స్ ఫలితాలను ప్రకటించాం. 2020 డిసెంబర్ 14 నుంచి 20 మధ్య మెయిన్స్ పరీక్ష నిర్వహించాం. ప్రిలిమ్స్‌లో పాస్ అయిన వారికి మెయిన్స్ నిర్వహించడమే మా ప్రభుత్వం చేసింది." "ఫైనల్ ఫలితాల వెల్లడిలో ఏ తప్పూ జరగలేదని చంద్రబాబు ప్రభుత్వమే హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. 2025 నవంబర్ 14న ఆయన ప్రభుత్వంలోని అధికారులు కోర్టుకు అఫిడవిట్ ఇచ్చారు. మరి ఇప్పుడు అదే ప్రభుత్వం మరో రకమైన ప్రచారం ఎందుకు చేస్తోంది?"
"2025 ఏప్రిల్‌లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తూనే ఒక సిట్ వేశారు. కోర్టులో కేసు జరుగుతుండగానే, చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా అఫిడవిట్లు పడటం మొదలయ్యాయి. ఆ తర్వాత 2026 ఫిబ్రవరి 14న మరో సిట్ వేశారు. మొదటి సిట్‌పై నమ్మకం లేక రెండో సిట్ ఎందుకు? సిట్‌లో ఉండేది ఎవరు? చంద్రబాబు నాయుడు కింద పనిచేసేవారు కాదా?" " హ్యాయ్‌లాండ్‌లో ఏదో జరిగిపోయిందని పదేపదే ప్రచారం చేస్తున్నారు. కానీ హైలాండ్‌లో జరిగిన ప్రక్రియకు ఫైనల్ మూల్యాంకనం, ఎంపిక ప్రక్రియకు ఎలాంటి సంబంధం లేదని అధికారిక పత్రాలు చాలా స్పష్టంగా చెబుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వమే 2025 నవంబర్ 11న హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌ను కూడా చూడాలి." "అరెస్ట్ చేసినట్టుగా, జైలులో పెట్టినట్టుగా, మెజిస్ట్రేట్ ముందు పెట్టినట్టుగా, జడ్జి శిక్ష వేసినట్టుగా అసెంబ్లీలో మాట్లాడుతున్నారు. కానీ వాస్తవం ఏమిటి? తేదీ చూపించండి. 25/08/2025న స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. అరెస్ట్ కాదు. మరి అరెస్ట్ చేసినట్టుగా ఈ ప్రచారం ఎందుకు?" "కేంద్ర ప్రభుత్వం 2009 నుంచి ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన వ్యక్తి వివరాలను సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేసి ట్రాక్ చేయాలి. అక్కడే 'యెట్ టు బీ అరెస్టెడ్' అనే స్థితి చూపిస్తున్నారు. మరి అరెస్ట్ చేసినట్టుగా అసెంబ్లీలో ఎలా మాట్లాడుతున్నారు? రికార్డుల్లో ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు పెట్టాలి." "డీఎస్సీ అంశంపై చర్చ జరగాలి. లోకేష్ రాజీనామా చేయాల్సిన అవసరం లేదని చెప్పడానికి వాళ్ల దగ్గర సాక్ష్యాలు, ఆధారాలు ఉంటే సభలో పెట్టాలి. సీబీఐ విచారణ అవసరం లేదని చెప్పడానికి కూడా ఆధారాలతో సిద్ధంగా ఉంటే కౌన్సిల్‌లో చర్చకు రావాలి. కానీ చర్చకు మాత్రం రారు. చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారు." "డీఎస్సీ అంశంపై తప్పులు జరిగాయని స్పష్టంగా కనిపిస్తున్నాయి. చర్చకు రారు. సీబీఐ విచారణకు ఆదేశించరు. అలాంటి పరిస్థితుల్లో లోకేష్ రాజీనామా చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ తేటతెల్లంగా కనిపిస్తోంది." జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

## జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదు

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీల మధ్య గల వ్యత్యాసం కూడా తెలియదని, ఆ అజ్ఞానం వల్లే గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు జగన్ పాత ప్రెస్ మీట్ వీడియోను లోకేశ్ గురువారం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. "ఏపీపీఎస్సీ అంటే ఏమిటో తెలియదు, డీఎస్సీ అంటే ఏమిటో తెలియదు. రెండూ ఒకటే అని జగన్ భావిస్తున్నారు" అంటూ లోకేశ్ తన పోస్ట్‌లో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని నియామక వ్యవస్థలపై జగన్‌కు ఉన్న అవగాహన లోపం వల్లే గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. ఉద్యోగ నియామకాలపై అసెంబ్లీలో జరిగే చర్చ నుంచి కూడా జగన్ పారిపోతున్నారని ఆక్షేపించారు.
ఏపీపీఎస్సీ (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్), డీఎస్సీ (జిల్లా ఎంపిక కమిటీ)... ఈ రెండు వేర్వేరు వ్యవస్థలనే కనీస పరిజ్ఞానం కూడా జగన్‌కు లేదని లోకేశ్ విమర్శించారు.

## బొత్స అనూష పొలిటకల్ ఎంట్రీ...

**విజయనగర్ :** మాజీ మంత్రి, వైసీపీ నేతబొత్స సత్యనారాయణ కుమార్తె అనూష రాజకీయ రంగ ప్రవేశంపై క్లారిటీ వచ్చింది. బుధవారం రోజు మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా తన వారసురాలి రాజకీయ రంగ ప్రవేశంపై బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్య లు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె అనూష పోటీ చేస్తుందని బొత్స సత్యనారాయణ వెల్లడించారు. విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దింపనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఏ పద్ధతిలో జరిగినా, పోటీ చేయడం పక్కానని క్లారిటీ ఇచ్చారు. దీంతో బొత్స కుటుంబం నుంచి మరో తరం పొలిటికల్ ఎంట్రీకి ముహూర్తం ఖరారైందని రాజకీయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు బొత్స అనూష వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పటికే అడపాదడపా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటూ.. పొలిటికల్ ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి అనూష బరిలోకి దిగుతూ ఉండటంతో విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికలు ఈసారి మరింత ఆసక్తికరంగా మారాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్ర పాలిటిక్స్‌లో బొత్స కుటుంబం సుమారు నాలుగు దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోంది. 1978లో విద్యార్థి నేతగా బొత్స సత్యనారాయణ రాజకీయ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు అయ్యారు. 1999లో కాంగ్రెస్ తరుఫున బొబ్బిలి ఎంపీ అయ్యారు. ఆ తర్వాత చీపురుపల్లి అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బొత్స సత్యనారాయణ.. వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గాల్లో పనిచేశారు. ఏపీసీసీ అధ్యక్షుడిగానూ వ్యవహరించారు.2014లో రాష్ట్ర విభజన తర్వాత వైసీపీలో చేరిన బొత్స.. జగన్ మంత్రివర్గంలోనూ పనిచేశారు. బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ కూడా రాజకీయాల్లో రాణించారు. రెండుసార్లు విజయనగరం జెడ్పీ ఛైర్ పర్సన్‌గా, ఓసారి విజయనగరం ఎంపీగా వ్యవహరించారు. బొత్స సత్యనారాయణ సోదరుడు బొత్స అప్పలనరసయ్య 2019 ఎన్నికల్లో గజపతినగరం నుంచి వైసీపీ తరుఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు బొత్స కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వస్తున్న నాలుగో వ్యక్తిగా బొత్స అనూష నిలవనున్నారు.

# గ్రామీణ విద్యుత్ సహకార సంస్థల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి కొణతాల.

**పాలిటెక్నిక్ కళాశాలకు నిధులు, సిబ్బంది కల్పించాలి.**



**అమరావతి, ఆగస్ట్ 20: గురువారం** జరిగిన అసెంబ్లీ సమావేశంలో మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ గ్రామీణ విద్యుత్ సహకార సంస్థల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని శాసనసభలో కోరారు. జీరో అవర్ లో ఆయన మాట్లాడుతూ 1974 లో గ్రామీణ విద్యుదీకరణలో భాగంగా ఏర్పాటైన విద్యుత్ సహకార సంస్థలు ఎంతో విజయవంతంగా పనిచేశాయని తెలిపారు. ప్రస్తుతం అవి విద్యుత్ బోర్డు పరిధి లోకి బదలాయింపు అవుతున్న సందర్భంలో ఉద్యోగుల ప్రాథమిక హక్కులు, వేతనాలు, సంక్షేమ సదుపాయాల పై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. 20--30 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉద్యోగులకు తగిన జీతాలు అందడం లేదని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్నారు. పీఎఫ్ చెల్లింపుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అంశాల పై విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా ఉద్యోగులకు హెల్త్, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ సదుపాయాలు కొనసాగించాలని అన్నారు. బీమా లేకపోవడం వల్ల ఉద్యోగులు ప్రమాదాలకు గురైనప్పుడు వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని తెలియజేసి వాటిని పునరుద్ధరించాలని కోరారు.

కో ఆపరేటివ్ (ఆర్ఈసిఎస్) సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న పాలిటెక్నిక్ కళాశాలకు కూడా ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని కోరారు. సంస్థకు వచ్చిన లాభాల్లో నుంచి ప్రతి ఏడాది కనీసం 2 కోట్లు కళాశాల నిర్వహణకు కేటాయించి, సిబ్బంది జీతాలు, ఉపాధ్యాయులు సిబ్బంది నియామకాలు చేపట్టాలని సూచించారు.
పాలిటెక్నిక్‌కు సంబంధించిన సుమారు 112 కోట్ల ఆస్తుల విషయంలో విద్యుత్ బోర్డు, సహకార శాఖల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించి, ఆస్తులు ఏ శాఖ పరిధిలో ఉండాలనే దాని పై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు. కళాశాలను సహకార సంస్థలు నిర్వహించలేని పరిస్థితి ఉంటే ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల వేతనాలు, పీఎఫ్, బీమా, పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణ, ఆస్తుల బదలాయింపు అంశాల పై సంబంధిత శాఖలు స్పష్ట మైన చర్యలు తీసుకుని, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు.

# దేవాలయ భూ ములను పరి రక్షించాలని శాసనసభలో కోరిన ఎమ్మెల్యే యార్లగడ్డ.

- గన్నవరంలో మైనింగ్ అక్రమాల పై విధించిన జరిమానాను వసూలు చేయాలి.
- ఎమ్మార్వో పై విచారణ చేపట్టాలని కోరిన చర్యలు తీసుకోలేదు యార్లగడ్డ.
- వర్షాభావ పరిస్థితుల్లో రైతుల పై నీటి తీరువా భారం తొలగించాలి యార్లగడ్డ.
- పోలవరం కాలువ పరిహార ప్రాంతాల్లో చెరువులు నింపి తాగునీటి సమస్య పరిష్కరించాలి.
- విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి యార్లగడ్డ.
- ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో పెండింగ్ పరిహారం వెంటనే చెల్లించాలి యార్లగడ్డ.



**అమరావతి, ఆగస్ట్ 20:** నియోజకవర్గం లోని దేవాలయ భూములను పరి రక్షించడంతో పాటు విమానాశ్రయ నిర్వాసితులు, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీ వేదికగా కోరారు. శాసనసభ సమావేశంలో భాగంగా గురువారం ఆయన మాట్లాడుతూ నిడమానూరు గ్రామం లోని రాజ రాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 12.42 ఎకరాల భూమి 20 ఏళ్లుగా ఇతరుల అధీనంలో ఉందని తెలిపారు. ఈ విషయం పై హైకోర్టు లోనూ దేవస్థానానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని, పాస్‌బుక్ కూడా దేవస్థానం పేరుతో జారీ అయిందని చెప్పారు. అన్యాక్రాంత మైన భూమిని వెంటనే స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎండోమెంట్స్ మంత్రి ని కోరారు. అలానే పాతపాడు లోని చెన్నకేశవ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. విజయవాడ బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ఆలయానికి చెందిన భూమి పోయిందని ఇందుకు సంబంధించిన రూ.38.98 లక్షలు ఎన్‌హెచ్‌ఏఐ, కలెక్టర్ ల్యాండ్ అక్విజిషన్ ఉమ్మడి ఖాతాలో ఉన్నాయని తెలిపారు. ఆ నిధులను ఎండోమెంట్స్ శాఖకు బదలాయించి ఆలయ పునర్నిర్మాణానికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా జిల్లాలో గతంలో జరిగిన మైనింగ్ అక్రమాల పై రూ.87 కోట్ల జరిమానా విధించగా, గన్నవరం ప్రాంతం లోనే సుమారు రూ.52 కోట్ల జరిమానా విధించినప్పటికీ ఇప్పటి వరకు వసూలు కాలేదని వెంకట్రావు తెలిపారు. ఈ వ్యవహారం పై సామాజిక కార్యకర్త హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. గతంలో విజిలెన్స్ విచారణకు ఆదేశించిన సమయంలో అప్పటి తహసీల్దార్‌గా పనిచేసిన నరసింహ రావు పై విచారణ చేపట్టాలని పలుమార్లు కోరినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీని పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నీటి తీరువాను రద్దు చేయాలని కోరారు. గన్నవరం ప్రాంతంలో పోలవరం కాలువ పరిధి లోని పరిహార ప్రాంతాల్లో చెరువులను నింపితే కనీసం తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులు దశాబ్దకాలంగా సమస్యలు ఎదుర్కొంటున్నారని యార్లగడ్డ తెలిపారు. ఇటీవల 356 ప్లాట్లు కేటాయించినట్లు చెప్పారు. వెలగపూడిలో సీతారామ స్వామి ఆలయానికి 7 వేల గజాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో ఎస్సీ వర్గాలకు ఇంకా చెల్లించాల్సిన పరిహారం ఉందని, భూములు ఇచ్చి ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మైక్రో కెనాల్ సమస్యను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# గత ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన పంచాయతీ నిధులను దారి మళ్లించింది యార్లగడ్డ.





**కూటమి ప్రభుత్వం పంచాయతీలకు రూ.4,200 కోట్ల నిధులు విడుదల చేసింది.**

**రాష్ట్ర వ్యాప్తంగా 13,325 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహించడం అభినందనీయం యార్లగడ్డ.**

**మంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖలో 10 వేల మందికి పైగా ఉద్యోగులకు ఒకే సారి పదోన్నతులు కల్పించారు యార్లగడ్డ**

**సబ్ రిజిస్ట్రార్, సీఆర్డీఏ నుంచి పంచాయతీలకు రావాల్సిన వాటా నిధులపై చర్యలు తీసుకోవాలి : యార్లగడ్డ**

**అమరావతి, ఆగస్ట్ 20:** పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకువచ్చిందని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ
గత ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం పంచాయతీ వ్యవస్థను బలహీనపరిచిందని విమర్శించారు. మండల పరిషత్ లలో ఇద్దరు ఉపాధ్యక్షులు, జిల్లా పరిషత్ లలో ఇద్దరు ఉపాధ్యక్షుల పదవులను సృష్టించి అలంకారప్రాయంగా మార్చిందన్నారు. వాటివల్ల పరిపాలనాపరంగా ప్రయోజనం లేకపోవడంతో మండల పరిషత్ కు ఒక ఉపాధ్యక్షుడు, జిల్లా పరిషత్ కి ఒక ఉపాధ్యక్షుడు ఉండేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత పంచాయతీలకు ప్రాధాన్యం పెంచుతూ చర్యలు చేపట్టిందని వెంకట్రావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 13,325 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమన్నారు. సర్పంచుల విజ్ఞప్తి మేరకు 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,200 కోట్లు విడుదల చేయడం అభినందనీయమన్నారు. పంచాయతీరాజ్ శాఖలో పలు సంస్కరణలు చేపట్టిన ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం కేంద్రం పంచాయతీలకు విడుదల చేసిన నిధుల్లో రూ.12 వేల కోట్లను దారి మళ్లించడంతో స్థానిక సంస్థలు తీవ్రంగా నష్టపోయాయని ఆరోపించారు. పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిన పరిస్థితిని మార్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్న లక్ష్యాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. గడువు ముగిసే దశకు చేరిన పథకానికి కూటమి ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్రం 95.44 లక్షల నీటి కనెక్షన్లు కల్పించేందుకు గడువును 2028 జులై 30 వరకు పొడిగించిందన్నారు. గతంలో ఉన్న 7,244 క్లస్టర్ల పంచాయతీ విధానాన్ని రద్దు చేసి గ్రామ పంచాయతీని స్వతంత్ర పరిపాలనా యూనిట్‌గా మార్చినట్లు తెలిపారు. ఐదు గ్రేడ్లుగా ఉన్న పంచాయతీలను మూడు గ్రేడ్లుగా పునర్వ్యవస్థీకరించడంతో పాటు 359 పునర్వ్యవస్థీకరించిన పంచాయతీలకు పీడీ పోస్టులు కల్పించినట్లు చెప్పారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను కూడా కల్పించారన్నారు. మంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖలో 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారని అలానే 42 మంది ఎంపీడీవోలకు పదోన్నతులు కల్పించారని పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గం లోని 84 గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెంకట్రావు సభ దృష్టికి తీసుకొచ్చారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రావాల్సిన రిజిస్ట్రేషన్ చార్జీల వాటా, సీఆర్డీఏ నుంచి పంచాయతీలకు రావాల్సిన వాటా నిధులు అందడం లేదన్నారు. వాటిని వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కోరారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనలను ప్రభుత్వం పరిగణన లోకి తీసుకుంటుందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రిజిస్ట్రేషన్ చార్జీల వాటా నిధులు గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు అందలేదన్న విషయాన్ని వెంకట్రావు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెప్పించుకుని సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల, జిల్లా పరిషత్‌లలో ఉపాధ్యక్షుల సంఖ్యను తగ్గిస్తూ తీసుకొచ్చిన చట్ట సవరణ పరిపాలనలో గందరగోళాన్ని నివారించేందుకేనని మంత్రి స్పష్టం చేశారు. గతంలో రాజకీయ ప్రయోజనాల కోసం ఈ మార్పులు జరిగాయని, వాటివల్ల పరిపాలనాపర మైన ఇబ్బందులు తలెత్తాయని పేర్కొన్నారు. సభ్యుల సూచనలు, సలహాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

# నేత్రపర్వంగా చినదొడ్డిగల్లు మరిణమ్మతల్లి జాతర

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- 5000 మంది భక్తులకు అన్నదానం






**నక్కపల్లి, పెన్ సత్తా ఆగస్టు 20 :** మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో గురువారం ఆ గ్రామదేవత మరిణమ్మతల్లి జాతర నేత్రపర్వంగా జరిగింది. ముందుగా ఉదయం గ్రామంలోని పెద్ద వీధి రామాలయం వద్ద నుండి అమ్మవారి ఘటానికి గురుభవానీ ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు. గ్రామానికి చెందిన వందలాది మంది మహిళలు నైవేద్యాలతో నింపిన అమ్మవారి బోనాలను శిరస్సుపై ధరించి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం మరిణమ్మతల్లి అమ్మవారి ఆలయానికి చేరుకుని అక్కడ అమ్మవారికి బోనాలు సమర్పించారు. తదుపరి ఆలయంలో దర్శనాలు ప్రారంభమయ్యాయి. స్థానికులతో పాటు సమీప గ్రామాల నుండి వేలాది మంది భక్తులు క్యూలో నిలబడి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, పార్టీ మండల అధ్యక్షులు గొర్ల గోవిందరావు వైసిపి నాయకులు పొడకట్ల పాపారావు, వెంకటేశ్వరరావు, కాకర వెంకటరావు, ప్రసాద్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరందరికీ ఆలయ నిర్వాహకులు అమ్మవారి శేష వస్త్రాన్ని వేసి ప్రత్యేక పూజలు జరిపించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద సుమారు 5వేల మంది భక్తులకు అన్న ప్రసాధాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఆత్రేయపురం మండలలో మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పునఃనిర్మించాలి.

- వేల ఎకరాలకు నీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ లు శిథిలావస్థకు చేరాయి.
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే సత్యానందరావు.



**అమరావతి, ఆగస్ట్ 20:** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లోని సెంట్రల్ డెల్టాలో కొత్తపేట నియోజకవర్గంలో ఆత్రేయపురం మండలం పరిధిలో ఉన్న మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పునఃనిర్మించాల్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను కోరారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ లొల్ల లాకుల పైన కొంచెం మెట్ట ప్రాంతంగా ఉంటుందని దానికి గ్రావిటీ మీద నీరు వెళ్ళే పరిస్థితి లేదని లిఫ్ట్ ఇరిగేషన్ల ఉన్నాయని ఉచ్చిలి, వసంతావాడ అనే రెండు లిఫ్ట్ ఇరిగేషన్ లో ఏపీఐడిసి కింద నీరు అందిస్తున్నట్టు తెలిపారు. ఉచ్చిల స్కీమ్ వచ్చి 1,176 ఎకరాలు, వసంతవాడ స్కీమ్ వచ్చి 2,010 ఎకరాలు ఏపీఐడిసి కింద ఉన్నాయని, అదే విధంగా మేజర్ ఇరిగేషన్ కింద పేరవరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ 3,000 ఎకరాలు, మూడు లిఫ్ట్ ఇరిగేషన్ కూడా పని చేస్తేనే ఆ ప్రాంత రైతులకి సాగునీరు అందించే పరిస్థితి ఉందన్నారు. మూడు కూడా శిథిలావస్థలో ఉన్నాయన్నారు. అందులో ఉచ్చిల స్కీమ్ అయితే మొత్తం మొత్తం సిధిల మైందని, దాన్ని నిర్మాణానికి అంచనాలు వేయించం జరిగిందని 9 కోట్ల రూపాయలని, అదే విధంగా వసంతవాడ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కూడా మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉందని, దానికి 3 కోట్ల 60 లక్షల రూపాయలు అంచనా వేయడం జరిగిందని వివరించారు. పేరవరం స్కీమ్ 5 వేల ఎకరాలు మేజర్ ఇరిగేషన్ కింద దాన్ని పూర్తిగా రెన్యూవేషన్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మూడు స్కీముల విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. చాలా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్లు రాష్ట్రంలో ఈ విధమైన పరిస్థితులకు కారణం గత ప్రభుత్వం నిర్వాకం వలన చాలా ఇబ్బందులు వచ్చాయన్నారు. లక్షలాది ఎకరాలు ఆయకట్టు రైతులకు మేలు చేకూరుతుందని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు అన్నీ కూడా పునరుద్దరణ చేసే ఈ ప్రతిపాదల ప్రభుత్వం దగ్గర పరిశీలనలో ఉన్నాయన్నారు. ఆత్రేయపురం మండలం లోని మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో నిర్ణయం తీసుకొని పరిపాలన అనుమతులు మంజూరు చేసి లిఫ్ట్ ఇరిగేషన్లన్నీ పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టాలని ఎమ్మెల్యే సత్యానందరావు కోరారు.

# సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి.

- ప్రాజెక్టు నిర్వహణను ఎల్అండ్‌టీ లేదా ఆర్‌డీటీ సంస్థకు అప్పగించాలి.
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర.



**అమరావతి, ఆగస్టు 20:** సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు కింద పనిచేస్తున్న కార్మికులకు నెలసరి వేతనాలు సక్రమంగా మంజూరు చేసి, ప్రజలకు త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రత్యేకంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు.
ఉమ్మడి అనంతపురం జిల్లా లోని ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలనే ఉద్దేశంతో పుట్టపర్తి భగవాన్ సత్యసాయి బాబా 1997 లో సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టును ప్రారంభించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రాజెక్టు పరిధిలో 273 వ్యక్తిగత స్కీమ్‌లు, 19 వివిధ స్కీమ్‌లు, మరో 5 ఇతర స్కీమ్‌లు ఉన్నాయని చెప్పారు.
సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు ద్వారా సుమారు 1,341 గ్రామాలకు, దాదాపు 16.40 లక్షల మంది ప్రజలకు త్రాగునీరు అందుతోందని వివరించారు. ఇంతటి కీలక మైన ప్రాజెక్టు నిర్వహణలో పనిచేస్తున్న సుమారు 576 మంది కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడం ఆందోళనకరమన్నారు.
వేతనాలు అందకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదే సమయంలో కార్మికుల కొరతతో ప్రాజెక్టు నిర్వహణ, ప్రజలకు త్రాగునీటి సరఫరా పై కూడా ప్రభావం పడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్మికుల వేతనాల కోసం నెలకు సుమారు రూ.1.30 కోట్లు, ప్రాజెక్టు నిర్వహణ, మెయింటెనెన్స్ కోసం మరో రూ.50 లక్షలు అవసరమవుతున్నాయని తెలిపారు. గతంలో ఎల్అండ్‌టీ సంస్థ ద్వారా కార్మికులకు వేతనాలు సక్రమంగా చెల్లించేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు నిర్వహణను తిరిగి ఎల్అండ్‌టీ సంస్థకు లేదా ఆర్‌డీటీ సంస్థకు అప్పగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. లేదా ప్రభుత్వం ద్వారా తగిన ఏజెన్సీని ఏర్పాటు చేసి కార్మికులకు ప్రతినెలా వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు లక్షలాది మంది ప్రజల త్రాగునీటి అవసరాలను తీర్చే అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని, దీనిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు.


## విధి నిర్వహణలో ఫోటో జర్నలిస్టుల నైపుణ్యం ఎనలేనిది

- విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్.
- నగర ప్రజలకు మధురమైన అనుభూతి నిచ్చిన రెండు రోజుల ఛాయాచిత్ర ప్రదర్శన.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్టు 20:** విధి నిర్వహణలో ఫోటో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మూతుకుమిల్లి శ్రీ భరత్ అన్నారు. కళలు, క్రీడ, ప్రభుత్వ తదితర ముఖ్య మైన కార్యక్రమాలను ప్రజలందరికీ ఒకే ఒక ఫోటో ద్వారా తెలియజేసేందుకు నిరంతరం కష్టపడతారని పేర్కొన్నారు. వైజాగ్ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదిల్లో బీచ్ రోడ్ లోని విశాఖ మ్యూజియం వేదికగా జరుగుతున్న కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రెండో రోజు ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వీడియోలు, రీల్స్ హావా కొనసాగుతుందని అయితే ఫోటోకి ఉండే ఆదరణ ఎప్పటికీ తగ్గదని అన్నారు. ప్రస్తుత తరం ఫోటోలు తీయడమంటే సులువు అనుకుంటారని, అయితే వాస్తవ పరిస్థితులను అంతర్గతంగా అర్థం చేసుకొని తీసేదే నిజమైన ఫోటోగ్రఫీ అని, వాటిని ప్రదర్శించిన ఫోటో జర్నలిస్టులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఐక్యంగా అసోసియేషన్ ద్వారా మంచి కార్యక్రమాన్ని రెండు రోజులపాటు నిర్వహించడంతో పాటు ప్రజలందరికీ ఉచితంగా తిలకించే అవకాశం కల్పించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ముందుగా ఎంపీ ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న సందర్భంలో అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జాతీయ, కన్సోలేషన్ అవార్డులు పొందిన చిత్రాలకు సంబంధించి వివరాలను ఫోటో జర్నలిస్టులను అడిగి తెలుసుకున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి శ్రీనివాసరావు మాట్లాడుతూ గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింహ రావు, సిపిఎం సెంట్రల్ మెంబర్ కే లోకనాథం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్.వి కుమార్, జాతీయ జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి గంట్ల శీను బాబు, తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చోడే పట్టాభి రామ్, డాక్టర్ జహీర్ అహ్మద్, ఇతర ప్రముఖులు ప్రదర్శనను తిలకించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన వైజాగ్ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు వై .రామకృష్ణ మాట్లాడుతూ రెండు రోజుల ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించిన ప్రముఖులకు, ఉన్నతాధికారులకు, కళాశాలలు పాఠశాలల విద్యార్థిని ,విద్యార్థులకు, సందర్శకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే గల్లా మాధవి




**గుంటూరు, పెన్ సత్తా, ఆగస్ట్ 20:** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం పై గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి అసెంబ్లీలో గళమెత్తారు. ప్రతి జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగు లోకి తీసుకువస్తున్నారని, వారి సంక్షేమాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు పై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆమె అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల చిరకాల డిమాండ్ అయిన ఇళ్ల స్థలాల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి, జర్నలిస్టుల తరఫున గళమెత్తిన ఎమ్మెల్యే గల్లా మాధవికి వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆమె చేసిన ఈ ప్రయత్నాన్ని సంఘాల నాయకులు అభినందించారు.

## ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాల్లో ఏర్పాటు పరిశీలించిన కలెక్టర్



**కె-కోటపాడు, పెన్ సత్తా, ఆగస్ట్ 20:**స్వర్ణాంధ్ర స్వచ్ఛాఆంధ్ర కార్యక్రమములో పాల్గొనేందుకు ఈనెల 22 న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా కె-కోటపాడు మండలం, ఏ-కోడూరు గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాల్లో అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్. ఈ కార్యక్రమంలో భాగస్వామ్య మైన జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, జిల్లా అధికారులు.

# బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశాలకు పకడ్బందీ ఏర్పాట్లు.





**అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్.**

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్టు 20:** ఈ నెల 22, 23 వ తేదీల్లో విశాఖపట్నం వేదికగా నిర్వహించనున్న బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో సమావేశాల ఏర్పాట్ల పై ఆయన సమీక్ష నిర్వహించారు. బ్రిక్స్ దేశాల నుంచి క్రీడా మంత్రులు, ఉన్నతాధికారులు విశాఖపట్నానికి రానున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ర్యాడిషన్ బ్లూ, నోవాటెల్ హోటళ్లలో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని ఆదేశించారు. విదేశీ అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా, వసతి, ప్రోటోకాల్ తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. విమానాశ్రయం, హోటళ్ల వద్ద ప్రత్యేక రిసెప్షన్ డెస్క్‌లను ఏర్పాటు చేసి అతిథులకు అవసర మైన సహాయాన్ని అందించాలని సూచించారు. జిల్లాలో బాధ్యతలు అప్పగించిన అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పాటు విదేశీ ప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. డ్యూటీ అధికారులు, సిబ్బందికి అవసర మైన పాసులను ముందుగానే జారీ చేయాలని ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయి కార్యక్రమం కావడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 22 న తొట్లకొండలో మొక్కలు నాటే కార్యక్రమం.

ఈ నెల 22 వ తేదీ ఉదయం 8 గంటలకు తొట్లకొండలో బ్రిక్స్ క్రీడా మంత్రుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు ఉదయం 10.40 గంటల వరకు అతిథులు తొట్లకొండలో ఉండనున్నందున అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. తొట్లకొండ వాతావరణ పరిస్థితులకు అనుకూల మైన మొక్కలను అటవీ శాఖ అధికారులు గుర్తించి నాటాలని సూచించారు. నాటిన మొక్కలను భవిష్యత్తులో సంరక్షించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

తొట్లకొండ కార్యక్రమం అనంతరం ర్యాడిషన్ బ్లూ హోటల్‌లో ద్వైపాక్షిక సమావేశాలు, యువజన వ్యవహారాలకు సంబంధించిన ఇతర సమావేశాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 22 వ తేదీ సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశీ క్రీడా మంత్రులతో నోవాటెల్ లో జరిగే ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం విదేశీ అతిథులతో ముఖ్యమంత్రి గాలా డిన్నర్ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో పటిష్ట మైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, విదేశీ అతిథులతో కలిపి సుమారు 150 మంది పాల్గొనే అవకాశం ఉన్నందున రవాణా, భద్రత, ప్రోటోకాల్ తదితర అంశాల్లో సమన్వయం ఉండాలని సూచించారు. 23 న బీచ్ రోడ్డు లో ఫ్రెండ్లీ సైక్లింగ్: 23 వ తేదీ ఉదయం బీచ్ రోడ్డు లో ఫ్రెండ్లీ సైక్లింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జివిఎంసి ఆధ్వర్యంలో 40 సైకిళ్లు, క్రీడా శాఖ ఆధ్వర్యంలో 25 సైకిళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉదయం 8 గంటల వరకు నోవాటెల్ నుంచి వైఎంసీఏ వరకు వాహనాల రాకపోకలను అనుమతించ కుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. సైకిల్ ర్యాలీ జరిగే ప్రాంతంలో వాకింగ్, వ్యాయామం చేసే వారికి కూడా తాత్కాలికంగా అనుమతి ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలకు ముందస్తు సమాచారం అందేలా మార్గమధ్యంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

23 వ తేదీ సాయంత్రం రుషికొండ బీచ్‌లో విదేశీ అతిథులకు డిన్నర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్య ప్రాంతాల్లో వెల్‌కమ్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు విశాఖ, ఆంధ్రప్రదేశ్ స్థానిక సంప్రదాయాలు, సంస్కృతి ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే థింసా నృత్య ప్రదర్శనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో నగర సుందరీకరణ, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమీక్షలో శాప్ ఎండీ భరణి, డీసీపీ మణికంఠ, డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భావ, అభ్యుదయ కవితా సేతువు తిలక్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్టు 20:** ప్రముఖ సాహితీవేత్త, భావకవి, అభ్యుదయ కవి, మానవతావాది దేవరకొండ బాలగంగాధర తిలక్ 105 వ జయంతి వేడుకలు ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖ సమావేశ మందిరంలో నిర్వహించిన సాహిత్య దర్శనం కార్యక్రమంలో తిలక్ చిత్రపటానికి శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ తిలక్ కవిత్వంలో అభ్యుదయం, మానవతావాదం, భావం, అనుభూతి సమ్మిళిత మై ఉన్నాయని అన్నారు. ఏకైక సిద్ధాంతానికి పరిమితం కాకుండా సామాన్య మానవుడి పై అభ్యుదయ దృష్టితో తిలక్ సాహిత్యాన్ని సృష్టించారని పేర్కొన్నారు. సమాజం లోని అన్యాయాలు, అక్రమాలను తన రచనల్లో స్పష్టంగా ప్రతిబింబించారని తెలిపారు. ఆచార్య నల్లా సత్యనారాయణ మాట్లాడుతూ తిలక్ తన రచనల ద్వారా సమాజాన్ని, జాతిని మేల్కొలిపారని అన్నారు. ఆచార్య గజ్జా యోహాన్ బాబు మాట్లాడుతూ తిలక్ రచనలు పోటీ పరీక్షలకూ ఉపయోగపడే స్థాయిలో ఉన్నాయని, అమృతం కురిసిన రాత్రి విద్యార్థులు తప్పక చదవాల్సిన గ్రంథమని పేర్కొన్నారు. శేఖర మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తిలక్ కథలు, కవితలు, నాటకాల్లో మానవత్వమే ప్రధాన సందేశమని అన్నారు. డా. అన్నంశెట్టి ఈశ్వరమ్మ మాట్లాడుతూ తిలక్ కవిత్వంలో సామాజిక స్పృహ, సామాజిక బాధ్యత స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తిలక్ కవిత్వం, కథలు, నాటకాలు, నాటికలు, వ్యాసాలు, లేఖల్లో విమర్శాత్మక దృక్పథం విస్తారంగా ఉందన్నారు. ఆయన రచనల్లో సౌందర్యంతో పాటు సామాజిక విషాదం, సమకాలీన పరిస్థితుల పై విమర్శ కనిపిస్తాయని వివరించారు. డా. వెంకట సూర్యారావు మాట్లాడుతూ 'అమృతం కురిసిన రాత్రి' ఆధునిక తెలుగు సాహిత్యంలో విశిష్ట మైన గ్రంథమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు డా. ఎం. కృష్ణవేణి, డా. ఎం. దాసు, డా. బి. సూర్యనారాయణ, డా. ఎం. ప్రతాప్, డా. పి. శ్రీనివాసరావు, డా. ఎల్. గిరీష్‌కుమార్ పరిశోధక విద్యార్థి, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, డా. ఆర్. శివయ్య, పితాని ప్రసాద్, డా. కె.వి.ఎస్. మూర్తి, జి.ఎస్. శ్రీనివాస రావు, డా. మారదాన సుబ్బారావు, పరిశోధకులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు. పి. ఇస్లాం ఆహ్వానం పలుకగా, ఎం. మౌనిక వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

# జిల్లాల కలెక్టర్ల తో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్.







**అనకాపల్లి, ఆగస్టు 20:** రాష్ట్రం లోని అన్ని జిల్లాల కలెక్టర్లుతో గురువారం ఉదయం ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎలక్షన్స్ (పోలింగ్ కేంద్రాలు, సర్, ఫారం 6,7,& 8) నకు సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు.

అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఆర్.డి.ఓ వై.సత్యనారాయణ రావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లాకు సంబంధించి జిల్లా కలెక్టర్ వివరిస్తూ డ్రాఫ్ట్ రోల్స్ ప్రచురణ పూర్తయిందని, బిఎల్ఓ, బిఎల్ఏ ల సమావేశ మినిట్స్ కూడా అప్‌లోడ్ చేయడం జరిగిందని వివరించారు. ఫారమ్‌లు 6, 7 & 8 ప్రగతి గతంలో దాదాపు 4,000 వరకు ఉన్న పెండింగ్ అభ్యర్థనలు, ఈ నెలలో చేపట్టిన చర్యలతో 1,000 కి తగ్గాయని చెప్పారు. బుక్ కాల్ పెండెన్సీ ప్రస్తుతం 9 కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని రాబోయే 48 గంటల్లో పరిష్కరిస్తామని చెప్పారు. డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు ఎన్ఎస్జిపి కింద ఎలాంటి పెండింగ్స్ లేవని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కు కలెక్టర్ వివరించారు.

# విశాఖ, చెన్నై కారిడార్‌లో కెమికల్, పెట్రోకెమికల్ పార్కులు ఏర్పాటు చేయాలి ఎమ్మెల్యే పల్లా.

**అమరావతి, ఆగస్ట్ 20:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'భవ్య' పథకం కింద రాష్ట్రంలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక పార్కులలో భాగంగా, విశాఖపట్నం -- చెన్నై పి.సి.పి.ఐ.ఆర్ కారిడార్‌లో కెమికల్, పెట్రోకెమికల్ పార్కులను ప్రాధాన్యతా క్రమంలో ఏర్పాటు చేయాలని గాజువాక శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మన దేశం నుంచి ప్రపంచానికి పెద్ద ఎత్తున బల్క్ డ్రగ్స్, ఔషధాలు సరఫరా చేస్తున్నప్పటికీ, ముడిసరుకు లభ్యత లేక అనేక ఫార్మా పరిశ్రమలు సిక్ యూనిట్లుగా మారుతున్నాయని, అధిక ధరలతో ముడిసరుకును దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని గుర్తు చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటు లోకి వస్తుండటం, మెరుగైన పోర్టులు, సీ-రూట్స్ ఉన్న విశాఖ -- చెన్నై కారిడార్‌లో కెమికల్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే పరిశ్రమలకు ఎంతో ఊతం లభించడంతో పాటు డిమాండ్‌కు తగిన పెట్టుబడులు వస్తాయని వివరించారు.
అలాగే ప్రతి పరిశ్రమ విడివిడిగా కాలుష్య శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయడం భారమైనందున ప్రభుత్వమే కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని, అవి నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనిచేసేలా పర్యవేక్షించాలని కోరారు. వీటితో పాటు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు అక్కడే రెసిడెన్షియల్ క్వార్టర్స్, ఉత్పత్తుల నాణ్యత పరిశీలనకు టెస్టింగ్ సెంటర్లు, స్థానిక యువతకు శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను నెలకొల్పాలని సూచించారు. పరిశ్రమల్లో అనుకోని అగ్నిప్రమాదాలు లేదా మరణాలు సంభవించినప్పుడు రాజకీయ ఒత్తిళ్లతో అపరిమిత పరిహారాల సమస్యలు రాకుండా, ఇరువర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వమే



ముందస్తుగా ప్రామాణిక ప్రమాద బీమా, స్పష్టమైన నష్టపరిహార విధానాన్ని అమలు చేయాలని కోరారు.

# మారికవలస గిరిజన గురుకులం పాఠశాలను రద్దు చెయ్యవద్దు.



సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కు ప్రత్యామ్నాయ భవనం ఏర్పాటు చేయాలి.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 20:** మారికవలస గిరిజన గురుకులం బాలుర పాఠశాలను రద్దుచేస్తూ అదే స్కూల్ లో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీ ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం, ఏపీ గిరిజన గురుకులం (బా) మారికవలస పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామనీ జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పల నరస అన్నారు. గిరిజన గురుకులం పాఠశాలను రద్దు చెయ్యవద్దని కోరుతూ జగదంబ సెంటర్ నుండి విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహి, అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధ కృష్ణ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పల నరస పాల్గొని మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటు కు తాము వ్యతిరేకం కాదని, ఉన్న పాఠశాలను రద్దు చేసి గిరిజన విద్యార్థులకు విద్య నుండి దూరం చేయడని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని అన్నారు. 2004 లో ఆదివాసీ విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియా విద్య కోసం ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. నేడు సుమారు 500 మంది గిరిజన విద్యార్థులు విద్యాను అభ్యశిస్తున్నారు. పాఠశాలలో అడ్మిషన్ కొరకు ప్రభుత్వ నోటిఫికేషన్ జారీచేసిందని, ఎంట్రన్స్ ఎగ్జామ్ నిర్వహించిందన్నారు. ఉత్తీర్ణు లైన మెరిట్గిరిజన విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం అడ్మిషన్ ఇచ్చారు. ఉన్నత మైన విద్య అభ్యశించడానికి నాణ్య మైన విద్యకావాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా ఎంపిక కాబడిన మెరిట్ విద్యార్థులను సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీ ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ పాఠశాలలో విద్యా అభ్యశిస్తున్న 5,6,7 తరగతులలో సుమారు 274 మంది ఉత్తరాంధ్ర ప్రాంత గిరిజన విద్యార్థులను మొదటి దశలో ఏజన్సీ ప్రాంత పాఠశాలలకు బలవంతంగా బదిలీ చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల కోసం అదనంగా 10 రూమ్స్ తో కొత్త భవనం నిర్మాణం పూర్తి అయిన ఇప్పటికే పాఠశాలకు ఇంజనీరింగ్ శాఖ అప్పగించలేదు. పాఠశాల భవనం పై అదనపు భవనం నిర్మాణంకు అవకాశం ఉన్నప్పటికీ ఏజెన్సీపాఠశాలలకు తరలిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నాణ్యమైన విద్య అందించేందుకు తగిన సౌకర్యాలు లేక గిరిజన విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారు. గ్రామాల నుండి గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలువుతన్నారు. ఇటువంటి పరిస్థితులలో విశాఖటపట్నం, మారికవలస గురుకులం పాఠశాలలో విద్య అభ్యశిస్తున్న విద్యార్థులను ఏజెన్సీ ప్రాంతంలో తరలిస్తే నాణ్య మైన విద్యకు దూరమవుతారు. మారికవలస గిరిజన గురుకులం పాఠశాలను కొనసాగించాలి. పాఠశాలలో 5,6,7 తరగతులు విద్యా అభ్యశిస్తున్న 275 మంది ఉత్తరాంధ్ర గిరిజన విద్యార్థులను ఇదే పాఠశాలలో కొనసాగించాలి. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీకి ప్రత్యామ్నాయ భవనం ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమంలో కిల్లో సురేంద్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదివాసీ గిరిజన సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి బాలదేవ్, ధర్మాన పడాల్, కూడా రాధ కృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి, గిరిజన సమాఖ్య, సీదరి శ్రీలతపాఠశాల రక్షణ కమిటీమహిళా కన్వీనర్ కొర్రా రాజేష్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్, వంజంగి రమేష్ నాయుడు, పాఠశాల రక్షణ కమిటీకన్వీనర్ భాను, భారతి, ఎస్ఎఫ్ఐ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడు జీవన్, కార్యదర్శి కార్తీక్, విశాఖ జిల్లా అధ్యక్షుడు సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా పరిశీలన చేసిన ముత్యాలరాజు

**చిలకలూరిపేట, పెన్ సత్తా, ఆగస్ట్ 20:**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 లో భాగంగా పల్నాడు జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ క్రమంలో పురావస్తు, మ్యూజియంల శాఖ కమిషనర్ ముత్యాలరాజు పర్యవేక్షణలో చిలకలూరిపేట మండలం, కోమటినేనివారిపాలెంలో ఓటర్ల జాబితాను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ నంబర్ 214 వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు ఓటర్ల జాబితా లోని వివరాలను నిశితంగా పరిశీలించారు. ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఓటర్ల వివరాల పై ఈ విచారణ కీలకమని అధికారులు తెలిపారు.



పల్నాడు జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులుగా ఉన్న ముత్యాలరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, లోపరహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు. ప్రతి అర్హుడైన వ్యక్తి తన పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం అని అన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ఎన్నికల అధికారులు, బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని, కొత్తగా ఓటరు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని,ఇప్పటికే ఉన్న ఓటర్లు తమ వివరాలను నవీకరించు కోవాలని అధికారులు సూచించారు.


# ఓటర్ల జాబితా సమగ్ర సవరణ--2026 పై సమీక్షా సమావేశంలో కలెక్టర్

**నరసరావుపేట, పెన్ సత్తా, ఆగస్ట్ 20:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, 2026 లో భాగంగా పల్నాడు జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, పురావస్తు, మ్యూజియంల శాఖ కమీషనర్ ముత్యాలరాజు గురువారం ఉదయం కలెక్టర్ కార్యాలయం, నరసరావుపేటలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతిక శుక్లా పాల్గొన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ, వాస్తవ తనిఖీ, తొలగింపులు, చేర్పులు, దోషాల సవరణ, ఫోటోల అప్డేట్ తదితర అంశాల పై ఆయన సమీక్ష నిర్వహించి, అధికారులకు అవసర మైన దిశానిర్దేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అర్హులైన ఓటర్లు జాబితా నుంచి మినహాయింపు పొందకుండా,సక్రమ పద్ధతుల్లో నిర్ధారణ చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.



# ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అనకాపల్లి జిల్లాలో అవగాహన ర్యాలీ






**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 20:** ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లాలో ప్రజల్లో దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పై అవగాహన కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.
ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. అచ్చుతకుమారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డా. చంద్రశేఖర్ దేవ్, జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ), ప్రోగ్రామ్ అధికారులు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ప్రజలు దోమల నివారణలో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండ కుండా చూసుకోవడం, వారానికి ఒకసారి డ్రై డే పాటించడం, దోమల లార్వా వృద్ధి చెందే ప్రదేశాలను తొలగించడం, దోమతెరలను సక్రమంగా వినియోగించడం ద్వారా దోమల కాటును నివారించవచ్చని తెలిపారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపం లోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించు కోవాలని సూచించారు.
దోమల నియంత్రణ -- వ్యాధుల నివారణ; ప్రజల భాగస్వామ్యంతో ఆరోగ్యకరమైన సమాజం అనే సందేశంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భోగాపురం ఎయిర్ పోర్ట్ లో క్యాబ్ డ్రైవర్లకు పార్కింగ్ చార్జీలు రద్దు.

- డ్రైవర్ల ఐక్యత తోనే విజయం సాధించాం.
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను సందర్శించిన విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్.

**భోగాపురం, పెన్ సత్తా, ఆగస్ట్ 20:** ఎయిర్ పోర్ట్‌లో ఉబర్, ఓలా, రాపిడో తదితర క్యాబ్ సర్వీసుల్లో పనిచేస్తున్న డ్రైవర్ల సమస్యలను పరిశీలించేందుకు విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు బి జగన్, అధ్యక్ష, కార్యదర్శి జి శ్రీనివాసరావు, పోలినాయుడు ఇతర నాయకులు, డ్రైవర్లు భోగాపురం ఎయిర్ పోర్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్ట్ లోని క్యాబ్ పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలించి, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సందీప్ తో చర్చించడం జరిగింది. ముఖ్యంగా క్యాబ్ డ్రైవర్ల పై విధిస్తున్న పార్కింగ్ చార్జీలను రద్దు చేయడం డ్రైవర్ల ఐక్య పోరాటానికి లభించిన విజయమని బి జగన్ పేర్కొన్నారు. ఉబర్, ఓలా, రాపిడో వంటి క్యాబ్ లో పనిచేస్తున్న డ్రైవర్లు సంస్థలు వేరైనా, తమ సమస్యల విషయంలో అందరూ ఒక్కటిగా నిలబడి పోరాడటం వల్లే పార్కింగ్ చార్జీల రద్దు సాధ్యమైందన్నారు. డ్రైవర్ల ఐక్యతే ఈ విజయానికి ప్రధాన కారణమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా డ్రైవర్ల పై అనవసర మైన చార్జీలు, వేధింపులు విధిస్తే ఐక్యంగా పోరాడి వాటిని అడ్డుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు ఎయిర్ పోర్ట్ యాజమాన్యం, సంబంధిత అధికారులు యూనియన్‌తో నిరంతరం చర్చలు జరపాలని కోరారు.
డ్రైవర్లకు తాగునీటి సౌకర్యం కల్పించాలి.
భోగాపురం ఎయిర్ పోర్ట్ లో క్యాబ్ డ్రైవర్లకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని యూనియన్ డిమాండ్ చేసింది. ప్రయాణికుల కోసం గంటల తరబడి ఎండలో వేచి ఉండే డ్రైవర్లకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడం సరికాదన్నారు. క్యాబ్ డ్రైవర్లు ఎయిర్ పోర్ట్ రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి గౌరవ ప్రదమైన పని వాతావరణంతో పాటు అవసర మైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.
భరత్ విశాఖపట్నం ఎంపి నా? జి ఎం ఆర్ ఎజెంట్ నా?... భోగాపురం ఎయిర్ పోర్ట్‌జలో క్యాబ్ డ్రైవర్ల పై పార్కింగ్ చార్జీలు విధించడాన్ని సమర్థించే విధంగా జీఎంఆర్ యాజమాన్యానికి అనుకూలంగా మాట్లాడటం సరికాదని మేము అప్పుడే స్పష్టం చేశాం. క్యాబ్ డ్రైవర్ల పై అదనపు భారాన్ని మోపడం అన్యాయం. డ్రైవర్లు ఐక్యంగా తమ న్యాయ మైన డిమాండ్ పై నిలబడటంతో చివరకు పార్కింగ్ చార్జీలు రద్దు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్ , మైకేల్, సి హెచ్ శ్రీనివాసరావు ఉబర్, ఓలా, రాపిడో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాసరావు అవగాహన కార్యక్రమం.



**జగ్గయ్యపేట, పెన్ సత్తా, ఆగస్ట్ 20:** పట్టణం లో గురువారం ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలు, రోడ్డు భద్రత మరియు ప్రయాణికుల భద్రత పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా పాటించవలసిన ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి వివరంగా అవగాహన కల్పించడం జరిగింది. ముఖ్యంగా డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించ కూడదని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడపకూడదని సూచించడం జరిగింది. అలాగే ఆటోలో నిర్ణీత సంఖ్యలో మాత్రమే ప్రయాణికులను ఎక్కించు కోవాలని, ప్రయాణికులను ఎక్కించుకునే సమయంలో రోడ్డు మధ్యలో కాకుండా సురక్షిత మైన ప్రదేశంలో వాహనాన్ని నిలపాలని, బస్ స్టాండ్, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ కు అంతరాయం కలిగించే విధంగా ఆటోలను నిలపకూడదని సూచించడం జరిగింది. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికలు, వన్‌వే నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, పాదచారులు, ఇతర వాహనదారుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, రాత్రి సమయంలో వాహనం నడిపేటప్పుడు తగిన లైట్లు ఉపయోగించాలని తెలియజేయడం జరిగింది.
ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వాహనం నడుపుతున్న సమయంలో అనవసర మైన పోటీలు, ప్రమాదకర మైన ఓవర్‌టేకింగ్‌కు పాల్పడకూడదని సూచించడం జరిగింది. అదే విధంగా వాహనానికి సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పర్మిట్ మరియు ఫిట్‌నెస్ వంటి పత్రాలు చెల్లుబాటులో ఉండేలా చూసుకోవాలని, వాహనాన్ని ఎప్పటికప్పుడు మంచి కండిషన్‌లో ఉంచుకోవాలని అవగాహన కల్పించడం జరిగింది. ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, ట్రాఫిక్. సిబ్బందితో కలిసి..రోడ్డు ప్రమాదాల నివారణలో ఆటో డ్రైవర్ల పాత్ర ఎంతో ముఖ్యమని, ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనం నడిపితే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించడం జరిగింది.

# ఏపీ లో మిలాద్-ఉన్-నబీ సెలవు దినం మార్పు.

ఆగస్టు 26 కి జనరల్ హాలిడే ప్రకటన.

**అమరావతి, ఆగస్ట్ 20:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజలకు ఒక ముఖ్యమైన గమనిక. రాష్ట్రంలో మిలాద్-ఉన్-నబీ పండుగ సెలవు దినాన్ని మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.?అంతకు ముందు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు 25, 2026 (మంగళవారం) రోజునమిలాద్-ఉన్-నబీ సాధారణ సెలవు దినంగా ప్రకటించబడింది. అయితే, చంద్రదర్శనం (చంద్రుని ఉనికి) ఆధారంగా రబీ ఉల్ అవ్వల్ నెల తేదీ మారడంతో, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పాత సెలవు తేదీ: ఆగస్టు 25, 2026 (మంగళవారం). కొత్త సెలవు తేదీ: ఆగస్టు 26, 2026 (బుధవారం)
?చంద్రుని క్యాలెండర్ (లూనార్ క్యాలెండర్) ప్రకారం 12 వ రబీ ఉల్ అవ్వల్(మిలాద్-ఉన్-నబీ) ఆగస్టు 26 వ తేదీన రానున్నందున, ప్రభుత్వం 2025 డిసెంబర్ 4 న జారీ చేసిన జీఓ ఆర్.టి.నెం.2,276 కు సవరణ చేస్తూ, ఆగస్టు 26 వ తేదీ బుధవారం నాడు సాధారణ సెలవుదినం ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (పొలిటికల్) జె. శ్యామల రావు జిఓ జారీ చేశారు.

# జనసేన పార్టీ లెజిస్లేటర్ పార్టీ సమావేశం

**అమరావతి, ఆగస్ట్ 20:** శాసనసభ లోని ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అధ్యక్షతన నిర్వహించిన జనసేన పార్టీ లెజిస్లేటర్ పార్టీ సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ శాసనసభ్యులు. గురువారం శాసనసభ లోని జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అధ్యక్షతన నిర్వహించిన జనసేన పార్టీ లెజిస్లేటర్ పార్టీ సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల మీద అంతా కలిసి లోతుగా చర్చించి, స్థానిక సంస్థలు ఎన్నికల్లో జనసేనకుల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేలా ముందుకు తీసుకువెళ్లాలని సూచించడం జరిగినది. ఈ సమావేశ కార్యక్రమంలో జనసేన పార్టీ శాసనసభ్యులు, జనసేన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి పాల్గొన్నారు.




# కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేయాలి.

- వార్డుల డీలిమిటేషన్ పై అభ్యంతరాలు, ఫిర్యాదు లను క్షుణ్ణంగా పరిశీలించాలి.
- పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలి.
- ఒక్క ఓటరు కూడా మినహాయింపు కాకుండా, పేర్లు పునరా వృతం కాకుండా పక్కాగా పరిశీలించాలి.
- రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పని సరిగా పాటించాలి.
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్టు 20:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రానున్న జీవీఎంసీ ఎన్నికల నిర్వహణకు అవసర మైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేసి, పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి, చీఫ్ సిటీ ప్లానర్ ఏ. ప్రభాకర్ రావు, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులతో ఎన్నికల ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసే ఆదేశాలు, మార్గదర్శకాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అనుగుణంగా జీవీఎంసీ ఎన్నికల ఏర్పాట్ల ప్రక్రియకు ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా జీవీఎంసీ వార్డుల విస్తరణ, డీలిమిటేషన్‌కు సంబంధించి అందుతున్న అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిశీలించి నిబంధనల మేరకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని చీఫ్ సిటీ ప్లానర్, జోనల్ కమిషనర్లను ఆదేశించారు. అన్ని జోన్లలో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారనే వివరాలను పక్కాగా నమోదు చేయాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. ఓటర్ల జాబితాల్లో ఒక్క ఓటరు పేరు కూడా మినహాయింపు కాకుండా, ఏ ఒక్కరి పేరు పునరావృతం కాకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని, ఈ ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది, ఎన్నికల సామగ్రి నిర్వహణ పై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు, కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, వెలుతురు, మరుగుదొడ్లు, ర్యాంపులు, పారిశుధ్యం వంటి కనీస సదుపాయాలు ఉండేలా పరిశీలించాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు అనుకూలంగా పోలింగ్ కేంద్రాలు ఉండేలా ప్రణాళిక చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రతి జోన్‌లో ఎన్నికల ఏర్పాట్ల పై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, చేపట్టాల్సిన పనులు, బాధ్యత వహించే అధికారులు, పూర్తి చేయాల్సిన గడువులను నిర్దేశిస్తూ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ అదనపు కమిషనర్ డివి రమణమూర్తికి ఆదేశించారు. ఈ సమీక్షలో జీవీఎంసీ సిటీ ప్లానర్, సహాయ పట్టణ ప్రణాళిక అధికారులు, డిపిఓ నాగార్జున, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, జోనల్ పర్యవేక్షకులు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# విశాఖ హార్బర్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు.

- మత్స్యకారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.
- డీజిల్ సబ్సిడీ బకాయిలు రూ.2.8 కోట్లు వెంటనే విడుదల చేయాలి.
- డీజిల్ సబ్సిడీని 9 శాతం నుంచి 15 శాతానికి పెంచాలి.
- మునిగిన, కాలిపోయిన బోట్ల యజమానులకు నష్టపరిహారం అందించాలి.
- శిక్షణ పూర్తి చేసిన మహిళలకు కుట్టు మిషన్లు, శిక్షణ ఇచ్చినవారికి పెండింగ్ వేతనాలు అందించాలి.

**అమరావతి, ఆగస్ట్ 20:** విశాఖపట్నం హార్బర్ దేశం లోనే అతిపెద్ద మత్స్యకార హార్బర్లలో ఒకటని, సుమారు 900 చిన్న, పెద్ద బోట్ల ద్వారా వేలాది మత్స్యకార కుటుంబాలు తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నాయని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అసెంబ్లీ సమావేశంలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత మత్స్యకారుల సంక్షేమానికి అనేక కీలక చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సహకారంతో విశాఖ హార్బర్‌లో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని తెలిపారు. మత్స్యకార భరోసా మొత్తాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచడం, ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మరణిస్తే అందించే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం వంటి నిర్ణయాలు మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసాకు నిదర్శనమన్నారు. మత్స్యకారులకు జీపీఎస్ పరికరాలు, సబ్సిడీ పై వలలు అందించడంతో పాటు బోట్ల మరమ్మతులకు ఉపయోగపడే క్రేన్‌ను హార్బర్‌లో ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అయితే గత ప్రభుత్వ కాలానికి సంబంధించిన రూ.2.8 కోట్ల డీజిల్ సబ్సిడీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మంత్రి ని కోరినట్లు తెలిపారు. పెరుగుతున్న డీజిల్ ధరలు, మత్స్యకారుల జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అందుతున్న డీజిల్ సబ్సిడీని 9 శాతం నుంచి 15 శాతానికి పెంచాలని కోరారు. గత రెండు, మూడు సంవత్సరాలుగా ప్రమాదాల్లో అనేక బోట్లు మునిగిపోవడం, మరికొన్ని బోట్లు అగ్నిప్రమాదాలకు గురై పూర్తిగా కాలిపోవడం జరిగిందని, బాధితులకు ఇప్పటివరకు తగిన నష్టపరిహారం అందలేదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత బోట్ల యజమానులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా గానీ, ఇతర ప్రభుత్వ సహాయ పథకాల ద్వారా గానీ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అదే విధంగా బీసీ మహిళలకు అందించిన కుట్టు శిక్షణ కార్యక్రమాల్లో శిక్షణ పూర్తి చేసిన మహిళలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, శిక్షణ పొందిన వారికి కుట్టు మిషన్లు అందించి వారు స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.



మత్స్యకారుల ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు పోరాడుతామని, విశాఖ హార్బర్ అభివృద్ధితో పాటు మత్స్యకార కుటుంబాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# అక్రమ గ్రావెల్ మట్టి తరలింపు పై దర్యాప్తు జరపాలి



మైనింగ్ మాఫియాను అరికట్టాలని డిమాండ్

పోలవరం కాలువ గట్టును పరిశీలించిన వీసం

**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగష్టు 20:** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం ముకుందరాజుపేట వద్ద పోలవరం ఎడమ కాలువ గట్లు గ్రావిల్,మట్టి అక్రమ తరలింపు పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ముకుందరాజుపేట వద్ద పోలవరం కాలువ గట్లను వైసిపి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతం లో కొన్ని వేల మెట్రిక్ టన్నుల గ్రావెల్, మట్టి టిప్పర్లతో అక్రమంగా తరలించకపోయారన్నారు. ఇంత పెద్ద ఎత్తున గ్రావిల్ ఎలా మాయమైందో రెవెన్యూ అధికారులు నిగ్గు తెల్చాలని డిమాండ్ చేశారు. పోలవరం కాలువ గట్లు మట్టి గ్రావిల్ గుల్లిపాడు రైల్వే స్టేషన్ వద్ద ఎత్తు చేయడానికి పర్మిషన్ ఎవరు ఇచ్చారు? అక్రమ లే అవుట్ లు కు గ్రావిల్ మట్టి తోలుకొనుటకు పర్మిషన్ వుందా అని ఆయన ప్రశ్నించారు. దీనిపై మైనింగ్, రెవిన్యూ శాఖ అధికారులు సమగ్ర దర్యాప్తు జరపి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

రైతులు సొంత అవసరాలకు ఒక బండి మట్టి తరలిస్తే రెవెన్యూ అధికారులు వారిని బెదిరిస్తారని అలాంటిది ఇంత మొత్తంలో ట్రావెల్ మట్టి తరలించకు పోతుంటే రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు అన్నారు. తక్షణమే ఈ ప్రాంతంలో గ్రావిల్ మట్టి తరలించకు పోయిన మట్టి దొంగ లను శిక్షించాలని లేనిపక్షంలో తీవ్ర ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు, నాయకులు పోడకట్ల పాపారావు, వెంకటేశ్వరరావు, కాకర వెంకట్రావు, ముకుంద రాజుపేట తాజా మాజీ సర్పంచ్ వియ్యపు శ్రీను స్థానిక నాయకులు రైతులు పాల్గొన్నారు.

## 87 వ వార్డు లో ప్రపంచ దోమల దినోత్సవం.

- ముఖ్య అతిధులుగా మాజీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాధం (జగన్).




**గాజువాక, పెన్ సత్తా, ఆగస్ట్ 20:** నియోజకవర్గం 87 వ వార్డు పరిధిలో మలేరియా డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా మాజీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాధం (జగన్) పాల్గొని వడ్లపూడిలో యాంటీ మలేరియా కేంద్రం నుండి దోమలు నివారణ పై నినాదం చేస్తూ వడ్లపూడి, కణితి ఆర్ హెచ్ కాలనీలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ విష జ్వరాలు వ్యాపించే దోమలు మంచినీటి లోనే పుడతాయని మన పరిసర ప్రాంతాలను నీటి నిలువలు లేకుండా చూసుకుంటే వాటిని అరికట్టవచ్చని, మన ఇంటి పరిసరాలలో ఉండే వ్యర్థాలను ప్రతిరోజు వస్తున్న చెత్త బండికి అందజేయాలని ఇవన్నీ పాటించడం ద్వారా ఆరోగ్యకర మైన జీవితం సాగించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అద్యక్షులు విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్, ఆదినారాయణ, బొండా సూర్యనారాయణ, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, హెల్త్ సూపర్వైజర్, హెల్త్ అసిస్టెంట్ లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 23 న ఉదయం 8.00 గంటల వరకు బీచ్ రోడ్లో ట్రాఫిక్ మళ్లింపు.

- నోవాటెల్ నుంచి సీ-హారియర్ వరకు బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల సైకిల్ ర్యాలీ.
- వాహనదారులకు, ప్రజలకు ముందుగానే చెప్పాలన్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్.



**విశాఖపట్టణం, పెన్ సత్తా, ఆగస్ట్ 20:** ఈ నెల 23 వ తేదీ ఉదయం 8.00 గంటల వరకు వాహనాలకు, నడకదారులకు బీచ్ రోడ్లో అనుమతి లేదని, ఈ విషయాన్ని ప్రజలకు, వాహనదారులకు ముందు నుంచే తెలియజేయాలని పోలీసులను, కార్యక్రమ నిర్వాహకులను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు సూచనలు చేశారు. ఆ రోజు ఉదయం బ్రిక్స్ దేశాల నుంచి వచ్చిన క్రీడా మంత్రులు, కేంద్ర క్రీడా శాఖ మంత్రి ఫ్రెండ్లీ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారని, దానికి ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కావున తెల్లవారు ఝాము నుంచి ఉదయం 8.00 గంటల వరకు కోస్టల్ బ్యాటరీ జంక్షన్ నుంచి పార్కు హోటల్ మధ్యలో వాహనాలను అనుమతించకూడదని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. నడక, వ్యాయామం చేసే వారికి కూడా స్పష్టంగా తెలియజేయాలన్నారు. అంతర్జాతీయ స్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నందున ప్రజలు సహకరించాలని ఈ క్రమంలో ఆయన విజ్ఞప్తి చేశారు.

## విశాఖ ఎకనామిక్ రీజన్ అభివృద్ధి పనులు పై సమీక్ష.

ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ చర్చలు.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 20:** విశాఖ ఎకనామిక్ రీజన్ అభివృద్ధి పనుల నేపథ్యంలో, మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల పై ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు జోన్స్, అభిజిత్ రాయ్, జ్యోతి నాయర్ గురువారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ను జీవీఎంసీ ప్రధాన కార్యాలయం లోని ఆయన చాంబర్లో కలిసి పలు అంశాల పై చర్చించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ పరిధిలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే మెగా ప్రాజెక్టుల పై కమిషనర్ ప్రతినిధి బృందంతో చర్చించారు. నగరంలో పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలకు అనుగుణంగా అవసర మైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరాన్ని కమిషనర్ వివరించారు.

ఎకనామిక్ రీజన్ సిటీగా విశాఖపట్నం అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు సహకారం, సాంకేతిక పరిజ్ఞానం, నిధుల వినియోగానికి సంబంధించిన అంశాల పై కూడా ఇరుపక్షాలు పరస్పరం చర్చించుకున్నారు. ఈ సమీక్షలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఫైనాన్స్ ఎస్ ఎస్ వర్మ, స్మార్ట్ సిటీ సీఈఓ ఆనంద్, విస్కో కన్సల్టెంట్ కె వి ఎన్ రవి తదితరులు పాల్గొన్నారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు..
PEN SATTA Telugu Daily


## సంపాదకీయం

## గట్టిగా.. 'నో' చెప్పాలి!

భారత ఆర్థిక వ్యవస్థపై అత్యంత తీవ్ర ప్రభావం చూపగల అమెరికా తాజా ఆరోపణ ఒకటి ఆగస్టు 14న వెలుగులోకి వచ్చింది. శ్వేతసౌధం వాణిజ్య, తయారీ విధాన కార్యాలయం విడుదల చేసిన 'ది గ్రేట్ ట్రాన్‌షిప్‌మెంట్ స్కామ్' నివేదిక, చైనా సుంకాల ఎగవేతకు సహకరిస్తున్న 40కి పైగా దేశాల్లో భారత్‌ను అగ్రస్థానంలో నిలిపింది. కెనడా, యూరోపియన్ యూనియన్, ఇజ్రాయెల్, జపాన్, మెక్సికో, దక్షిణ కొరియా, తైవాన్‌లతోపాటు భారత్‌ను 'టైర్-1: డైవర్సిఫైడ్ స్కేల్ లీడర్స్' విభాగంలో చేర్చారు. అంటే, చైనా వస్తువులను స్వల్ప మార్పులు చేసి, తక్కువ సుంకాలతో అమెరికాకు తిరిగి ఎగుమతి చేస్తున్నారన్నది ఆరోపణ. 2025లో మెక్సికో, భారత్, వియత్నాం మీదుగా దాదాపు 67 బిలియన్ డాలర్ల విలువైన చైనా వస్తువులు అమెరికాకు తరలివెళ్లాయని నివేదిక అంచనా వేసింది. భారత్‌లోని పుణె- గుజరాత్-చెన్నై పారిశ్రామిక బెల్ట్‌ను పంపులు, కంప్రెసర్ల కేంద్రంగా ప్రత్యేకంగా పేర్కొంటూ, దీన్ని అమెరికాలోని సిన్సినాటి, డేటన్, కొలంబస్ నగరాల్లోని పరిశ్రమలతో పోల్చడం గమనార్హం. అయితే, భారత ప్రభుత్వంగానీ, స్థానిక ఎగుమతిదారులుగానీ ఉద్దేశపూర్వకంగా సుంకాల ఎగవేతకు పాల్పడుతున్నారని నివేదిక ఎక్కడా స్పష్టంగా చెప్పలేదని, భారీ, వైవిధ్యభరిత వాణిజ్య స్థావరాలున్న దేశాల్లో చట్టబద్ధమైన వాణిజ్యం నుంచి ట్రాన్‌షిప్‌మెంట్ ముప్పును వేరుచేయడం కష్టమని కూడా నివేదిక అంగీకరించింది. చైనా దిగుమతులు భారత తయారీ రంగానికి కీలకమన్నది బహిరంగ రహస్యమే. అయితే, ఈ దిగుమతుల స్వభావం క్రమంగా మారుతోంది. పూర్తయిన ఉత్పత్తులను దిగుమతి చేసుకుని, స్వల్ప మార్పులు చేసి విక్రయించే విధానంనుంచి భారత్ నెమ్మదిగా బయటపడుతోంది. బదులుగా, చైనానుంచి భారత దిగుమతుల్లో మధ్యంతర వస్తువుల వాటా స్థిరంగా పెరుగుతోంది. అంటే, పలు రంగాల్లో అసెంబ్లింగ్, తయారీని భారత్ స్వయంగా చేస్తూ, అవసరమైన విడిభాగాల కోసం మాత్రమే చైనా, ఇతర దేశాలపై ఆధారపడుతోంది. ఇది 'మేక్ ఇన్ ఇండియా' పూర్తిస్థాయి తయారీ దిశగా ఒక ముఖ్యమైన అడుగు.

చైనా సుంకాల ఎగవేతపై తన మదింపు ఆధారంగా అమెరికా ఇంకా శిక్షాత్మక చర్యలను ప్రకటించలేదు. అయితే భవిష్యత్తులో అలాంటి అవకాశం లేదని చెప్పలేం. ఒకవేళ అలాంటి చర్యలు తీసుకుంటే, ఈ విషయంలో అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గకూడదు. ప్రభుత్వమే స్వయంగా అంగీకరించినట్టు, ప్రస్తుతం చైనా దిగుమతులు 'మేక్ ఇన్ ఇండియా' కథలో ఒక ముఖ్యమైన భాగం. భారత్ అమెరికా ఒత్తిడికి లొంగిపోతుందన్న భయానికి గత చరిత్రే బలమైన నిదర్శనం. తన మొదటి అధ్యక్ష పదవీకాలంలో, హైఎండ్ మోటార్‌సైకిళ్లపై భారత సుంకాలను ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. 2018లో భారత్ ఈ సుంకాలను 60-75 శాతం నుంచి 50 శాతానికి తగ్గించింది. వాణిజ్య ఒప్పంద చర్చలు ప్రారంభమయ్యేముందే 2025 ఫిబ్రవరిలో వాటిని మరింత తగ్గించి 40 శాతానికి చేర్చింది. అలాగే, రొయ్యల మేత, దాని విడిభాగాలపై దిగుమతి సుంకాలను 2024 ఫిబ్రవరి బడ్జెట్‌లో తగ్గించింది. ఇది అమెరికా చేసిన కీలక డిమాండ్లలో ఒకటి. 2025 ఆగస్టులో విధించిన 50 శాతం శిక్షాత్మక సుంకాల ఒత్తిడి, రష్యా చమురుపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భారత్‌ను నెట్టివేసింది. 2026 జనవరి నాటికి భారత చమురు దిగుమతుల్లో రష్యా వాటా 20 శాతంకంటే దిగువకు పడిపోయింది. ఆరు నెలల క్రితం 50 శాతం సుంకాలు విధించినప్పుడు ఉన్న దానికి దాదాపు సగానికి. 2019లో వెనెజువెలా చమురుతోనూ ఇదే జరిగింది. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా తాత్కాలిక సడలింపు కారణంగానే భారత్ మళ్లీ రష్యా చమురువైపు మళ్లుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవలే ఈ-కామర్స్ ఇన్వెంటరీ మోడల్‌లో ఎఫ్‌డీఐని అనుమతించడం.. అమెజాన్ దశాబ్దంపాటు లాబీయింగ్ చేసిన అంశమే.

ఈ నేపథ్యంలో, 2025 ఆగస్టులో అమెరికా విధించిన సుంకాల పరిణామాలను గుర్తుచేసుకోవడం అవసరం. మొదట ఏప్రిల్ 5న సార్వత్రిక 10 శాతం సుంకం విధించగా, ఆగస్టు 7న అది 25 శాతానికి, ఆగస్టు 27న రష్యా చమురు కొనుగోళ్లకు శిక్షగా అదనంగా మరో 25 శాతంతో మొత్తం 50 శాతానికి చేరింది. ఫలితంగా, భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. ఆగస్టులో అమెరికాకు ఎగుమతులు 16.3 శాతం పడిపోగా, ఇది 2025లో నమోదైన అత్యంత తీవ్రమైన నెలవారీ క్షీణతగా గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ పేర్కొంది. అయితే, ఈ సుంకాల విధింపులో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను జీటీఆర్ఐ ఎత్తిచూపింది. 2024లో చైనా 62.6 బిలియన్ డాలర్ల విలువైన రష్యా చమురును దిగుమతి చేసుకుంది, ఇది భారత్ దిగుమతి చేసుకున్న 52.7 బిలియన్ డాలర్లకంటే ఎక్కువ. అయినప్పటికీ బీజింగ్‌పై ఎలాంటి శిక్షాత్మక సుంకాలు లేవు. యూరోపియన్ యూనియన్ 2024లో రష్యానుంచి 39.1 బిలియన్ డాలర్ల దిగుమతులు చేసుకున్నా, దాన్నీ అమెరికా విస్మరించింది. ఈ అసమాన వైఖరి, అమెరికా వ్యూహం కేవలం వాణిజ్య న్యాయం కోసం కాదని, భారత్‌పై నిర్దిష్ట రాజకీయ, వ్యూహాత్మక ఒత్తిడి పెంచడానికేనని స్పష్టం.

అమెరికా అపారమైన ఒత్తిడి ప్రయోగించగలదు. కాబట్టి భారత్ కొన్ని రాయితీలు ఇవ్వడం అర్థం చేసుకోదగినదే. కానీ అదే భారత్‌పై మరిన్ని డిమాండ్లు చేసేందుకు అమెరికాకు ధైర్యాన్నిచ్చింది. ప్రతిసారీ ఒత్తిడికి తలొగ్గి రాయితీలిస్తూ పోతే, అది మరింత డిమాండ్లకు ఆహ్వానం మాత్రమే. మోటార్‌సైకిల్ సుంకాల నుంచి రొయ్యల మేత సుంకాల వరకు, రష్యా చమురు నుంచి ఈ-కామర్స్ ఎఫ్‌డీఐ వరకు -ప్రతి రంగంలోనూ ఇదే సరళి పునరావృతమవుతోంది. ఇప్పుడు ట్రాన్‌షిప్‌మెంట్ ఆరోపణల రూపంలో మరో కొత్త ఒత్తిడి వచ్చిపడుతోంది. దీన్ని ఎదుర్కోవడంలో భారత్ మరింత దృఢంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. చైనా దిగుమతులపై ఆధారపడటం క్రమంగా తగ్గించుకుంటూ, దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవడం దీర్ఘకాలిక పరిష్కారమే అయినా, అది వేగంగా సాధ్యం కాదు. ఈలోగా, అమెరికా చేసే ప్రతి డిమాండ్‌కూ వెంటనే తలొగ్గకుండా, భారత జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూ, దౌత్యపరంగా దృఢంగా బేరమాడే వ్యూహాన్ని అనుసరించాల్సిన సమయం ఆసన్నమైంది. వాణిజ్య భాగస్వామ్యం పరస్పర గౌరవం, న్యాయబద్ధమైన నిబంధనలపై ఆధారపడాలి తప్ప, ఏకపక్ష ఒత్తిడిపై కాదు. భారత్ ఇప్పుడు వెనక్కి తగ్గే వైఖరిని విడనాడి, గట్టిగా ఎదురుదెబ్బ తీసేందుకు సన్నద్ధం కావాలి!

## పనికొచ్చే పలుకు




## కాలానుగుణంగా మారక తప్పదు!

పరిస్థితులు వేగంగా మారుతున్నప్పుడు పాత పద్ధతులు పట్టుకు వేలాడితే.. ప్రమాదకరం అంటున్నాడు మేనేజ్‌మెంట్ ఎక్స్‌పర్ట్ పీటర్ డ్రక్కర్. సవాళ్లను ఎదుర్కొంటూ కొత్త వ్యూహాలతో ఎలా ముందడుగు వేయాలో ఆలోచించాలట. వ్యాపార రంగమైనా, వ్యక్తిగత జీవితమైనా సంక్షోభాలు ఎదురైనప్పుడు కొత్త వ్యూహాలతో ముందుకెళ్లాలన్నది పీటర్ డ్రక్కర్ ఎప్పుడో ఎప్పుడో చెప్పిన ఫిలాసఫీ. అంటే -కాలానుగుణంగా మనల్ని మనం మార్చుకోకుంటే వెనకబడతామన్నది ఆయన హెచ్చరిక. "సంక్షోభ కాలంలో ఎదురయ్యే అతి పెద్ద ప్రమాదం సంక్షోభం కాదు... నిన్నటి ఆలోచనలతో ముందడుగు వేయడమే" అంటాడు పీటర్ డ్రక్కర్. ఆస్ట్రియన్-అమెరికన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్, విద్యావేత్త అయిన పీటర్ డ్రక్కర్ మాటలు.. జెన్ జీ వంటబట్టించుకోవాలి. మార్పు అనివార్యమైనప్పుడు దానిని ఎదిరించడం కంటే, కొత్త ఆలోచనలతో స్పందించడమే విజేతల లక్షణమన్నది ఆయన విశ్వాసం. మనుషులు ఎప్పుడూ తమకు అలవాటైన పద్ధతుల్లోనే ప్రయాణించడానికి ఇష్టపడతారు. ముఖ్యంగా కష్టకాలంలో తెలిసిన దారిలోనే వెళ్లడం సురక్షితమని భావిస్తారు. కానీ, వేగంగా మారుతున్న కాలంలో పాత పద్ధతులను నమ్ముకుంటే నష్టపోక తప్పదు. 'నిన్నటి లాజిక్' అంటే కాలం చెల్లిన ఆలోచనలు, పాత అలవాట్లు గతంలో అద్భుతమైన ఫలితాలు ఇచ్చి ఉండొచ్చు. కానీ నేటి సరికొత్త సమస్యలను అవి పరిష్కరించలేవు. స్థిరమైన వృద్ధి సాధించాలంటే పాత ఆలోచనలు పక్కనపెట్టి, కొత్త ప్రయోగాలకు సన్నద్ధం కావాలి. సవాళ్లు అనేవి జీవితంలో ఎదురవుతూనే ఉంటాయి. వాటిని చూసి భయపడకుండా మన ఆలోచనా సరళిని మార్చుకుంటే, ఆ సవాళ్లనే అద్భుతమైన అవకాశాలుగా మలుచుకోవచ్చు. ఆర్థిక ప్రణాళికలు, కెరీర్ ఎదుగుదల, వ్యక్తిగత బంధాల బలోపేతం... ఇలా ఏ రంగంలోనైనా కొత్త సమాచారాన్ని స్వీకరిస్తూ తదనుగుణంగా వ్యూహాలు మార్చుకోవాలి. నిలకడైన ప్రయత్నం, స్పష్టమైన ప్రాధాన్యతలు ఉన్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. సో, పాత లాజిక్‌తో కొత్త సవాళ్లను ఎదుర్కోవాలనుకోవడమే అతిపెద్ద ప్రమాదం. మారుతున్న కాలానికి అనుగుణంగా మన ఆలోచనలను, వ్యూహాలను నిరంతరం సరిదిద్దుకోవడమే నిజమైన తెలివి. సవాళ్లను భయపెట్టే శత్రువులుగా కాకుండా, ఎదగడానికి వచ్చిన అవకాశాలుగా చూడండి. నిన్నటి విజయాలపై ఆధారపడకుండా, రేపటి కోసం సిద్ధం కావడమే విజేతల లక్షణం. మార్పును స్వీకరించే ధైర్యం ఉన్నవారికే భవిష్యత్తు స్వాగతం పలుకుతుంది.

ఎవరీ పీటర్ డ్రక్కర్?

ఆధునిక మేనేజ్‌మెంట్ సిద్ధాంతకర్తగా ప్రపంచవ్యాప్తంగా పీటర్ డ్రక్కర్ గుర్తింపు పొందారు. వ్యాపార నిర్వహణను ప్రత్యేక శాస్త్రంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదే. ఆయన సేవలను గుర్తిస్తూ అమెరికా ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' (2002)తో సత్కరించింది. దీనితోపాటు హెన్రీ లారెన్స్ గాంట్ మెడల్, ఆస్ట్రియన్ క్రాస్ ఆఫ్ హానర్ (1991) వంటి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. పీటర్ డ్రక్కర్ రాసిన పుస్తకాలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా మేనేజర్లు, సీఈఓలకు మార్గదర్శకాలు. వాటిలో అత్యంత ప్రజాదరణ పొందినవి.

ది ఎఫెక్టివ్ ఎగ్జిక్యూటివ్ (1967)
మేనేజ్‌మెంట్: టాస్క్స్, రెస్పాన్సిబిలిటీస్, ప్రాక్టీసెస్ (1973)
ఇన్నోవేషన్ అండ్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ (1985)
మేనేజింగ్ వన్‌సెల్ఫ్ (1999)
ది ఎస్సెన్షియల్ డ్రక్కర్ (2001)

# వికసిత భారతానికి వీరే బలం!



భారత్‌లోని దాదాపు ప్రతి నగరంలో.. దేశం మాట్లాడుకోవాల్సిన ఒక కుటుంబముంటుంది. తండ్రి ప్రతి ఏటా సకాలంలో పూర్తిగా ఆదాయపు పన్ను చెల్లిస్తాడు. తల్లి తన కూతురి ఇంజినీరింగ్ చదువు కోసం రుణం తీసుకుంటుంది. ఎప్పటికీ రాకూడదని ఆశించే అనారోగ్యం కోసం ప్రతి మార్చిలో బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈ కుటుంబం ప్రభుత్వాన్ని చాలా తక్కువగానే అడుగుతుంది. ఇదే భారత మధ్యతరగతి -దేశ ఆర్థిక వ్యవస్థకు నిశ్శబ్దంగా చోదకశక్తిగా మారింది. ఇటీవల ఫ్రాన్స్‌లో మన కేంద్ర ఆర్థిక మంత్రి మాట్లాడుతూ, 1995నుంచి భారత మధ్యతరగతి ఏటా సుమారు 6.3 శాతం చొప్పున విస్తరించిందని, ప్రస్తుత జనాభాలో దాదాపు 31 శాతంగా ఉందన్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) అంచనాల ప్రకారం, భారత వినియోగదారులు ఖర్చు చేసే ప్రతి ఐదు రూపాయల్లో నాలుగు రూపాయలు మధ్యతరగతి, అంతకంటే ఉన్నత వర్గాల నుంచే వస్తున్నాయి. 2036నాటికి ఇది ప్రతి పది రూపాయల్లో తొమ్మిదికి పైగా చేరనుండగా, 2047 నాటికి ఈ వర్గంలో వంద కోట్లకుపైగా భారతీయులుంటారని అంచనా. మధ్యతరగతి వృద్ధి పన్ను చెల్లింపుదారుల సంఖ్యలోనూ ప్రతిబింబిస్తోంది. ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఖ్య 2013-14లో 5.26 కోట్లనుంచి 2024-25కి 12.13 కోట్లకు రెట్టింపైంది. రిటర్న్‌ల దాఖలు కూడా 4 కోట్లనుంచి 8.18 కోట్లకు రెట్టింపైంది. పన్ను వ్యవస్థను కేవలం కఠినతరం చేయకుండా సరళీకరించినప్పుడే ఇలాంటి ఫలితాలు వస్తాయి.

ఆరోగ్య రంగంలోనూ ఇదే కథ పునరావృతమవుతోంది. ప్రభుత్వ ఆరోగ్య వ్యయం పెరుగుతున్న కొద్దీ, వైద్య చికిత్స కోసం కుటుంబాలు తమ సొంత జేబునుంచి చెల్లించే మొత్తం గణనీయంగా తగ్గింది. 2013-14లో 64.2 శాతం ఉన్న ఔట్-ఆఫ్-పాకెట్ వ్యయం ఇప్పుడు 39.4 శాతానికి పడిపోయింది. జాతీయ ఆరోగ్య విధానం నిర్దేశించిన 35 శాతం లక్ష్యానికి భారత్ ఇప్పుడు చేరువలో ఉంది. ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అధికారికీకరణ చెందుతున్నా, శ్రామిక మార్కెట్ మాత్రం స్థిరంగానే ఉంది. జాతీయ గణాంక కార్యాలయం ఆవర్తన శ్రామిక శక్తి సర్వే ప్రకారం, 2025లో మొత్తం నిరుద్యోగిత రేటు 3.1 శాతంగా నమోదైంది. ఇది భారత్ ఇప్పటివరకూ నమోదు చేసిన అత్యల్ప స్థాయిల్లో ఒకటి. అయితే, గ్రాడ్యుయేట్ నిరుద్యోగిత 11.2 శాతంగా ఉండటంతో, ప్రజల విద్య, నైపుణ్యాలకు తగినట్టుగా నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించడమే ప్రభుత్వ తదుపరి ప్రాధాన్యతగా మారింది. ఇలాంటి కుటుంబానికి ఇప్పుడు ప్రభుత్వం నుంచి కావాల్సింది మరింత సాయం కాదు. సంక్షేమం ముఖ్యమే, పేదలకు ప్రపంచంలో ఏ దేశమూ ప్రయత్నించనంత విస్తృత స్థాయిలో భారత్ దాన్ని విస్తరించింది. కానీ మధ్యతరగతి వేరే స్థానంలో నిలుస్తుంది. దాన్ని మోసుకెళ్లమని ఎప్పుడూ కోరుకోలేదు, కేవలం ఎదిగే మార్గాన్ని సుగమం చేయమని మాత్రమే కోరుతుంది. సబ్సిడీ కొరతకు సమాధానం ఇస్తుంది, అవకాశం మహత్వాకాంక్షకు సమాధానం ఇస్తుంది -ఇటీవలి విధాన దిశ ఈ వాస్తవాన్నే గుర్తిస్తోంది.

సంక్షేమం ద్వారా ప్రజలకు సాయం చేయడం, సంపద సృష్టి ద్వారా వారికి తోడ్పడటం -ఇవి రెండు వేర్వేరు విధానాలు. సంక్షేమాన్ని ప్రభుత్వం పంపిణీ చేసే దానితో కొలుస్తారు. సంపద సృష్టిని ప్రజలు సంపాదించగలిగే దానితో కొలుస్తారు. ఇప్పటికే పేదరికం నుంచి బయటపడిన కుటుంబానికి రెండోదే ఎక్కువగా అవసరం. ఇటీవలి సంస్కరణలు నిర్ణయాత్మకంగా ఆ దిశగానే మొగ్గుచూపాయి. ఏటా రూ.12 లక్షల వరకు ఆదాయం ఇప్పుడు పన్ను రహితం, జీఎస్టీని సరళమైన శ్లాబులుగా క్రమబద్ధీకరించారు, దశాబ్దాల సంక్లిష్టత తర్వాత చివరకు 1961నాటి ఆదాయపు పన్ను చట్టాన్ని పూర్తిగా భర్తీ చేశారు. ఈ సంస్కరణలు మధ్యతరగతి కుటుంబాలు.. ముందుగా ప్రభుత్వానికి చెల్లించి, తర్వాత ప్రయోజనాలుగా తిరిగి పొందే బదులు, తాము సంపాదించిన దాంట్లో ఎక్కువ భాగాన్ని తమవద్దే ఉంచుకునేలా చేస్తున్నాయి. మరింత మంది భారతీయులు అధికారిక ఆర్థిక వ్యవస్థలో చేరుతుండటంతో, జీఎస్టీ చెల్లింపుదారుల సంఖ్య 2017లో 66.5 లక్షల నుంచి 2026 ఏప్రిల్ నాటికి 1.64 కోట్లకు పెరిగింది. తొమ్మిదేళ్లలో దాదాపు రెండున్నర రెట్లు వృద్ధి. తక్కువ పన్నులు కుటుంబాలు తమ ఆదాయాన్ని ఎక్కువగా ఉంచుకోవడానికి సాయపడతాయి, మెరుగైన ఉద్యోగాలు ఆ ఆదాయాన్ని పెంచడానికి తోడ్పడతాయి. అందుకే ప్రభుత్వ ఇటీవలి పెట్టుబడులు మరిన్ని ఉపాధి అవకాశాల సృష్టిపైనే కేంద్రీకృతమయ్యాయి. 12 సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది, వీటి పెట్టుబడి విలువ దాదాపు రూ.1.64 లక్షల కోట్లు (సుమారు 1,900 కోట్ల డాలర్లు). ఇండియా ఏఐ మిషన్ 45,000కు పైగా జీపీయూలతో జాతీయ కంప్యూటింగ్ సదుపాయాన్ని నిర్మించింది. ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.13 లక్షల కోట్లకు (సుమారు 1,550 కోట్ల డాలర్లు) చేరి, భారత్ మూడో అతిపెద్ద ఎగుమతి రంగంగా నిలిచింది.

అయితే, ఈ అవకాశాలు నిజమైన శ్రేయస్సుగా మారాలంటే, తగిన నైపుణ్యాలతో యువతను సన్నద్ధం చేయడం అత్యవసరం. ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2026 ప్రకారం, ప్రస్తుతం కేవలం 56.35 శాతం గ్రాడ్యుయేట్లు మాత్రమే ఉపాధి యోగ్యులుగా పరిగణించబడుతున్నారు. స్కిల్ ఇండియా, జాతీయ విద్యా విధానంలో వృత్తి విద్యపై ప్రాధాన్యత వంటి ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, అప్రెంటిస్‌షిప్ కార్యక్రమాలు ఈ గణాంకాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. కళాశాలలు కేవలం డిగ్రీల కోసమే కాకుండా, ఉద్యోగాల కోసం బోధించాలి. యాజమాన్యాలు సిలబస్ రూపకల్పనలో సహకరించాలి, పరీక్షా బోర్డుల్లో పాల్గొనాలి. విద్యార్థులు డిగ్రీ పూర్తయిన తర్వాత కాకుండా, డిగ్రీలో భాగంగానే క్షేత్రస్థాయి పారిశ్రామిక అనుభవాన్ని పొందాలి. ప్రతి మధ్యతరగతి భారతీయుడూ జీతం మాత్రమే కోరుకోవడం లేదు -చాలామంది సొంతంగా ఏదైనా నిర్మించాలని కోరుకుంటున్నారు, ఉద్యమ్ ద్వారా సరళీకృత ఎంఎస్ఎంఈ నమోదు, సీజీటీఎంఎస్ఈ ద్వారా రుణ హామీలు, ట్రెడ్స్ ద్వారా ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ వంటి పథకాలు ఇప్పటికే దీన్ని సులభతరం చేస్తున్నాయి. చిన్న సంస్థలకు అధికారిక బ్యాంకు రుణాల వాటా 2020లో 14 శాతం నుంచి 2024కి 20 శాతానికి పెరగడం సానుకూల సంకేతం. భారత నగరంలో ఎక్కడో, ఆ తండ్రి ఇప్పటికీ సకాలంలో తన రిటర్న్ దాఖలు చేస్తూనే ఉన్నారు, ఆ తల్లి తన కూతురి రుణాన్ని తీరుస్తూనే ఉన్నారు. ఇద్దరూ ప్రభుత్వం నుంచి ఎలాంటి దానాన్నీ కోరలేదు, ఇప్పుడు క్రమంగా వారికి అలాంటి అవసరం కూడా తగ్గుతోంది. మధ్యతరగతికి అర్హమైనది, గత దశాబ్దపు సంస్కరణలు అందించాలని ప్రయత్నిస్తున్నది దానం కాదు, అవకాశం మాత్రమే. శిక్షణకు తగిన ఉద్యోగం, రిస్క్ తీసుకోదగిన వ్యాపారం, ప్రజాధనం ఇప్పటికే వాగ్దానం చేసిన దానికి రెట్టింపు పన్ను వేయని నగరం. ఇప్పుడు ప్రశ్న మధ్య తరగతి 'వికసిత్ భారత్' భారాన్ని మోయగలదా? అని కాదు -ఎందుకంటే ముప్పై ఏళ్లుగా నిశ్శబ్దంగా భారాన్ని మోస్తూనే ఉంది. ఇవాళ ఎప్పటికంటే ఎక్కువగా ప్రభుత్వ విధానాలు ఆ బాధ్యతను పంచుకోవడానికి సహకరిస్తున్నాయి అని. మధ్యతరగతి ఇక దానం కోరదు, అవకాశాన్నే కోరుతుంది. -ఆ అవకాశమే వికసిత్ భారత్‌కు నిజమైన పునాది. ■



ఎదుటివారు చేసిన తప్పు కంటే, దాని చుట్టూ మనం అల్లుకునే ఊహలే ఎక్కువ బాధ కలిగిస్తాయి. జరిగిన సంఘటనకు, మనసు సృష్టించే కథనానికి మధ్య తేడాను గుర్తించడం నేర్చుకోండి. వాస్తవాన్ని యథాతథంగా చూసినప్పుడే స్పష్టత లభిస్తుంది, అనవసర ఆందోళన తగ్గుతుంది. తక్షణ ప్రతిస్పందన కంటే, కాస్త సమయం తీసుకుని ఆలోచించడమే వివేకవంతమైన నిర్ణయానికి దారి తీస్తుంది. మనసును ప్రశాంతంగా ఉంచుకోగలిగినప్పుడే, ఏ పరిస్థితినైనా సరైన కోణంలో అర్థం చేసుకోగలుగుతాం.

-మహాదేవ

## వింతల్లో వింతలు

## 1400 ఏళ్ల నాటి బలి రహస్యం?



పెరూ రాజధాని లిమాలోని పురాతన హువాకా పుక్లానా పిరమిడ్ వద్ద పురావస్తు శాస్త్రవేత్తలు సంచలన కథనాన్ని వెలుగులోకి తెచ్చారు. ఒక వయోజన పురుషుడి అస్థిపంజరాన్ని తవ్వకాల్లో గుర్తించగా, ఆచార బలిగా అతడిని సమర్పించి ఉంటారని భావిస్తున్నారు. క్రీ.శ. 650 నాటిదిగా ప్రాథమికంగా అంచనా వేసిన ఈ అవశేషాలు, దాదాపు 1,400 ఏళ్ల నాటివి. సెరిమోనియల్ పూల్‌కు అనుసంధానమైన కాలువను మూసివేసే తంతులో భాగంగా ఈ బలి జరిగి ఉంటుందని పరిశోధకుల అభిప్రాయం. అస్థిపంజరం కాలువ లోపల ఎడమవైపు వాలి, పుర్రె పిరమిడ్, పసిఫిక్ మహాసముద్రం వైపు చూస్తున్నట్టు ఖననం చేయబడింది. తవ్వకాల నేతృత్వం వహించిన పురావస్తు శాస్త్రవేత్త గ్లాడిస్ పాజ్ ప్రకారం, ఈ ఎముకలు లిమా సంస్కృతి ఆచారాలను అర్థం చేసుకోవడానికి, వందల ఏళ్ల క్రితం నిర్వహించిన వేడుకలను పునర్నిర్మించడానికి ఉపయోగపడతాయి. చిన్న మట్టి ఇటుకలతో నిర్మించిన ఇతర నిర్మాణాలకు భిన్నంగా, నదీ రాళ్లతో నిర్మించిన ఈ ఆచార బావి నిర్మాణ శైలే ఈ ఆవిష్కరణలో అత్యంత ప్రత్యేకమైనదిగా పెరూ సంస్కృతి మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇంకా ఇక్కడ ఒక సెరామిక్ పాము తలను కూడా గుర్తించారు.

శ్రీలంకతో రెండు టెస్టుల సిరిస్‌లో శుభారంభం చెసిన టీమిండియా ఆఖరి పోరుకు సన్నద్ధమవుతోంది. ఆదివారం నుంచి కొలంబో వేదికగా జరిగే రెండో టెస్టులో ఆతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టెస్టు తరహాలోనే కొలంబోలోనూ ఆధిపత్యం చెలాయించి 2-0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో భారత్ ఉంది. తద్వారా డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ బెర్త్ అవకాశాలను మెరుగుపరుచుకోవాలనుకుంటోంది.

తొలి టెస్టులో భారత్ మూడు విభాగాల్లో సత్తా చాటింది. అయితే కుల్దీప్ యాదవ్ వైఫల్యం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో (1/65) ఒకే ఒక్క వికెట్ తీసిన కుల్దీప్ యాదవ్.. రెండో ఇన్నింగ్స్‌లో (0/37) ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయాడు. మరోవైపు మానవ్ సుతార్ 10 వికెట్లతో సత్తా చాటగా.. జడేజా నాలుగు వికెట్లు పడగొట్టాడు. దాంతో కుల్దీప్ యాదవ్‌పై విమర్శలు వస్తున్నాయి. అయితే కుల్దీప్ యాదవ్‌ను సరిగ్గా ఉపయోగించుకోలేదని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అనగా.. అతి తక్కువ ఓవర్లు బౌలింగ్ చేసి ఎక్కువ పరుగులు ఇచ్చాడని ఆకాశ్ చోప్రా తెలిపాడు.

ఈ క్రమంలోనే రెండో టెస్టు నుంచి కుల్దీప్ యాదవ్‌ను తప్పించి అతని స్థానంలో డొమెస్టిక్ వెటరన్ స్పిన్నర్ సరాన్ష్ జైన్‌ను ఆడిస్తారనే చర్చ జరుగుతోంది. అదే జరిగితే 33 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన భారత క్రికెటర్‌గా సరాన్ష్ జైన్ నిలవనున్నాడు. మరోవైపు భారత్ మూడో స్పిన్నర్‌తో ఆడాలనుకుంటే కుల్దీప్ యాదవ్‌ను కొనసాగించాలని అశ్విన్ సూచించాడు. ఆకాశ్ చోప్రా మాత్రం కుల్దీప్ యాదవ్ స్థానంలో సరాన్ష్ జైన్‌ను ఆడించవచ్చని అంచనా వేశాడు. మరి టీమ్ మేనేజ్మెంట్ ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



తొలి టెస్టులో ధ్రువ్ జురెల్ గాయపడ్డాడు. మూడో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తుండగా.. అతని ఎడమ చీలమండకు గాయమైంది. దాంతో అతను మైదానం వీడగా.. సర్ఫరాజ్ ఖాన్ సబ్స్టిట్యూట్ ఫీల్డర్‌గా మ్యాచ్‌లో కొనసాగాడు. ప్రస్తుతం అతని గాయాన్ని బీసీసీఐ మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తోందని తెలుస్తోంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే రెండో టెస్టుకు ధ్రువ్ జురెల్ దూరం కానున్నాడు. అతని స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ బరిలోకి దిగుతాడు. తొలి టెస్టులో జురెల్ హాఫ్ సెంచరీతో రాణించాడు.

మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, జైస్వాల్ ఆడనుండగా.. దేవదత్ పడిక్కల్ ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగనున్నాడు. శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా మిడిలార్డర్‌లో ఆడనున్నారు. తొలి టెస్టులో విఫలమైన జైస్వాల్, శుభ్‌మన్ గిల్ సత్తా చాటాల్సిన అవసరం ఉంది. మానవ్ సుతార్ స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఆడనుండగా.. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలలో ఒకరికి రెస్ట్ ఇవ్వాలనుకుంటే గుర్నూర్ బ్రార్ జట్టులోకి వస్తాడు. ఆకిబ్ నబీకి మరోసారి నిరాశే ఎదురవ్వనుంది.

శ్రీలంకతో రెండో టెస్ట్‌కు భారత్ తుది జట్టు(అంచనా)

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్/ సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, సరాన్ష్ జైన్/కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ/గుర్నూర్ బ్రార్.

# బీసీసీఐపై కీర్తి ఆజాద్ ఫైర్

- మిథున్ మన్హాస్‌పై ఏజ్ ఫ్రాడ్



ఆజాద్.. బీసీసీఐ ఏం చేస్తుందని విమర్శలు గుప్పించాడు. 'బారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఏం



# సచిన్‌తో పోల్చితే కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడు

## సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్

భారత క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలో ఎవరు అత్యుత్తమం అనే చర్చ తరుచూ జరుగుతూనే ఉంటుంది. భారత క్రికెట్ ఐకాన్స్ అయిన ఈ ఇద్దరి మధ్య పోలిక అనవసరమని చాలా మంది మాజీ క్రికెటర్లు సమాధానం చెప్పేందుకు తప్పించుకున్నారు. ఇద్దరి క్రికెటర్ల తరాలు భిన్నమైనవని, ఇద్దర్ని పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. కానీ తాజాగా సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్‌ను ఇదే ప్రశ్న అడగ్గా.. నిర్మోహమాటంగా సమాధానం చెప్పాడు. సచిన్‌తో పోల్చితే విరాట్ కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా టెస్ట్‌ల్లో విదేశీ గడ్డపై విరాట్ కోహ్లీ రాణించినట్లుగా సచిన్ ఆడలేకపోయాడని తెలిపాడు. విరాట్ కోహ్లీ విదేశీ గడ్డపై భారత బ్యాటింగ్ స్థాయిని పెంచారని, తన సమకాలీన ఆటగాళ్లు కూడా అక్కడి పరిస్థితుల్లో మెరుగ్గా రాణించేలా ప్రేరేపించారని ఏబీడీ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా పేర్కొన్నాడు. 'విదేశాల్లో సచిన్ టెండూల్కర్ ఒక ప్రమాణాన్ని నెలకొల్పాడు. కానీ కోహ్లీ ఆ ప్రదర్శనలను మరో స్థాయికి తీసుకెళ్లాడు. టెస్ట్ క్రికెట్‌లో 15,921 పరుగులు, 51 సెంచరీలతో సచిన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 176 ఇన్నింగ్స్‌ల్లో విదేశీ గడ్డపై 51 సగటుతో పరుగులు చేశాడు. మరోవైపు విరాట్ కోహ్లీ 123 టెస్ట్‌ల్లో 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. విదేశాల్లో కోహ్లీ సగటు 68 మ్యాచ్‌ల్లో 41గా ఉంది. భారత్ కోసం సచిన్ కొత్త ఒరవడిని ప్రారంభించినా.. విరాట్ కోహ్లీ అంతటి స్థాయి అప్పట్లో సచిన్‌కు లేదు. విదేశాల్లో బౌన్సీ, సీమింగ్ పిచ్‌లపై కూడా రాణించవచ్చని నిరూపించిన మొదటి వ్యక్తి సచిన్'అని ఏబీ డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ, సచిన్ టెండూల్కర్

# సింక్‌ఫీల్డ్‌లో ప్రజ్ఞకు రెండో స్థానం



సెయింట్ లూయిస్: సింక్‌ఫీల్డ్ కప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద టైటిల్ సాధించలేకపోయాడు. అతను రెండో స్థానంలో నిలిచాడు. ఫైనల్స్‌లో అతడు వెస్లీ సో (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. ఆఖరి రౌండ్లో అనిష్ గిరి (నెదర్లాండ్స్)తో గేమ్‌ను డ్రా చేసుకున్న ప్రజ్ఞ.. 5.5 పాయింట్లతో వెస్లీ సోతో సమంగా నిలిచాడు. దీంతో విజేతను నిర్ణయించేందుకు టైబ్రేకర్ అవసరమైంది. అందులో రెండు ర్యాపిడ్ గేమ్‌లు డ్రాగా ముగియగా.. ఆర్మగెడాన్‌లో ప్రజ్ఞపై సో విజయం సాధించాడు. టోర్నీలో కరువానా (4.5) మూడో స్థానంలో నిలిచాడు. ఈ ప్రదర్శనతో ప్రజ్ఞ గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాడు.



ప్రత్యేకమైన కట్-అవుట్ డిజైన్ దుస్తుల్లో నిధి అగర్వాల్ మెరుపులు

# పసుపు చీరలో ఏజ్‌లెస్ క్వీన్ త్రిష కృష్ణన్



దక్షిణాది సినీ పరిశ్రమలో దశాబ్దాలుగా తన ఏకఛత్రాధిపత్యాన్ని కొనసాగిస్తున్న పాపులర్ నటి త్రిష కృష్ణన్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయబద్ధమైన పసుపు రంగు చీర ధరించి దేవకన్యలా మెరిసిపోతున్న తన ఫోటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. విశేషమేమిటంటే ఆ చీర తన తల్లిదేనని తెలిపి అభిమానులను మురిపించారు. ఈ రాయల్ లుక్‌లో త్రిషను చూసిన అభిమానులు, నెటిజన్లు -ఏజ్‌లెస్ క్వీన్- అని ప్రశంసిస్తున్నారు.నాలుగు పదుల వయసుకు చేరువవుతున్నా త్రిష గ్లామర్ లో కించిత్ కూడా మార్పు రాలేదని.. రోజురోజుకూ ఆమె మరింత అందంగా తయారవుతున్నారని అభిమానులు మురిసిపోతున్నారు. నటి ఖుష్బూ సుందర్, ఐశ్వర్య కల్పాతి సహా పలువురు సినీ ప్రముఖులు త్రిష అలంకరణకు.. తన అందమైన రూపానికి ఫిదా అయిపోయి ప్రశంసలను కురిపించారు. కొందరు నెటిజన్లు త్రిష క్లాసిక్ సినిమాల్లోని డైలాగులను గుర్తుచేసుకుంటూ ఈ పోస్ట్‌ను సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి తెచ్చారు.మరోవైపు ఈ పోస్ట్ కింద నెటిజన్ల మధ్య తీవ్రమైన రాజకీయ, వ్యక్తిగత చర్చలు కూడా వేడెక్కిస్తున్నాయి. ముఖ్యంగా దళపతి విజయ్ సారథ్యంలోని పొలిటికల్ మీటింగ్‌లు లేదా తమిళనాడు ప్రభుత్వ సభల్లో త్రిష కనిపించడంపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు అభిమానులు త్రిషను సరదాగా విజయ్ కి చెల్లెలు(తంగచ్చి) అంటూ పోల్చగా.. మరికొందరు మాత్రం విజయ్ రాజకీయ భవిష్యత్తును.. ఆయన భార్య సంగీతను ప్రస్తావిస్తూ త్రిష ఇటువంటి పబ్లిక్ ఈవెంట్లకు దూరంగా ఉంటేనే మంచిదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ చర్చల నడుమ మరికొందరు నెటిజన్లు నటుడు శింబు (మాజీ ప్రియుడిగా ప్రచారం ఉంది) పేరును తెరపైకి తెచ్చారు. విజయ్ పొలిటికల్ ఇమేజ్‌ను ఇబ్బంది పెట్టకుండా.. ప్రస్తుతం సింగిల్‌గా ఉన్న శింబును త్రిష పెళ్లి చేసుకోవచ్చు కదా అంటూ విమర్శనాత్మకంగా.. సరదాగా సలహాలు ఇవ్వడం కనిపించింది. వీటికి తోడు గిల్లి, లియో చిత్రాల్లో వీరిద్దరి కాంబినేషన్‌ను ప్రస్తావిస్తూ వారి ఆన్-స్క్రీన్, ఆఫ్-స్క్రీన్ కెమిస్ట్రీపై నెటిజన్లు రకరకాల విశ్లేషణలు చేశారు.ఏది ఏమైనా తన అందంతో నెటిజన్లను కట్టిపడేస్తూనే... సోషల్ మీడియా వేదికగా నిరంతరం చర్చల్లో నిలవడం త్రిష ప్రత్యేకత. ఒకవైపు సౌత్ ఇండస్ట్రీలో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్న ఈ తమిళ తంగం.. మరోవైపు సోషల్ మీడియాలో తన ప్రొఫైల్ ద్వారా కోట్లాది మంది అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. వివాదాలు, విమర్శలు ఎలా ఉన్నా త్రిష పసుపు చీర లుక్ మాత్రం ఇన్‌స్టాగ్రామ్‌లో సెన్సేషన్‌గా మారింది.

# రన్‌టైమ్: నిడివి పెరిగినా ప్రేక్షకుల ఆదరణ!



వెండితెరపై సినిమా చూసే అనుభవంలో కాలక్రమేణా అనేక మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు సినిమాలకు రెండున్నర గంటల నిడివి మాత్రమే ఐడియల్ రన్‌టైమ్‌గా ఉండేది. అంతకంటే ఎక్కువైతే ప్రేక్షకులు బోర్ ఫీలవుతారనే అపనమ్మకం ట్రేడ్ వర్గాల్లో ఉండేది. కానీ ప్రస్తుతం ఆ లెక్కలన్నీ తలకిందులవుతున్నాయి. కథలో దమ్ముంటే, భావోద్వేగాలు పండుతుంటే నిడివి ఎంత ఉన్నా? ప్రేక్షకులు ఆస్వాదిస్తారనే నిజాన్ని ఇటీవలి కాలంలోని బాక్సాఫీస్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.ప్రస్తుత ట్రెండ్‌ను పరిశీలిస్తే -పుష్ప 2-, -యానిమల్-, -ఆర్ఆర్ఆర్- వంటి భారీ చిత్రాలు మూడు గంటల నిడివిని దాటినా బాక్సాఫీస్ వద్ద అసాధారణ విజయాలను నమోదు చేశాయి. రీసెంట్‌గా రిలీజ్ అయిన రణ్‌వీర్ సింగ్ -ధురంధర్- చిత్రం కూడా సుదీర్ఘమైన రన్‌టైమ్‌తో థియేటర్లలోకి వచ్చి అద్భుతమైన వసూళ్లను సాధించి సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ విజయాపజయాల సరళి చూస్తే? ప్రేక్షకులకు నిడివితో పనిలేదని, బలమైన కంటెంట్ ఉంటే గంటల తరబడి థియేటర్లలో కూర్చునేందుకు సిద్ధంగా ఉన్నారని రుజువవుతోంది.ఈ కోవలోనే కన్నడ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో యశ్ హీరోగా తెరకెక్కిన మోస్ట్ అవేటెడ్ మూవీ -టాక్సిక్- కూడా భారీ నిడివితో రాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం ఏకంగా 3 గంటల 14 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇంతటి సుదీర్ఘ రన్‌టైమ్ ఉండటం ఆసక్తికరంగా మారినా? మేకర్స్ మాత్రం కంటెంట్‌పై పూర్తి విశ్వాసంతో ఉన్నారు.సినిమాలో ల్యాగ్ ఉందా లేదా అనేది నిడివిని బట్టి నిర్ణయించలేమని, కథ చెప్పే విధానం .. స్క్రీన్ ప్లే గ్రిప్పింగ్‌గా ఉంటే మూడు గంటల సమయం కూడా నిమిషాల్లో గడిచిపోతుందని ట్రేడ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. దర్శకులు తాము చెప్పాలనుకున్న భావోద్వేగాలను, పాత్రల లోతును ప్రేక్షకులకు పూర్తిగా అనుభూతి చెందించడానికి పెద్ద చిత్రాలకు అదనపు సమయం ఎంతో అవసరమవుతోంది. అందుకే కంటెంట్ డిమాండ్ చేసినప్పుడు నిడివిని తగ్గించడానికి దర్శక నిర్మాతలు వెనుకాడటం లేదు.మొత్తానికి సినిమాలో విషయం ఉంటే? రన్‌టైమ్ మ్యాటర్ కాదు అనే సరికొత్త సూత్రం ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ట్రెండ్‌గా మారింది. ప్రేక్షకులకు విజువల్ వండర్‌తో పాటు బలమైన డ్రామాను అందించగలిగితే? వారు సినిమా నిడివిని సమస్యగా చూడరని భారీ చిత్రాల విజయం నిరూపిస్తోంది. రాబోయే రోజుల్లో పెద్ద బడ్జెట్ పాన్-ఇండియా సినిమాలన్నీ ఇదే బాటలో నడిచే అవకాశం కనిపిస్తోంది.ఈ పరిణామాలు దర్శకులకు మరింత స్వేచ్ఛను ఇస్తున్నాయి. కమర్షియల్ హంగుల కోసం కథను కుదించాల్సిన అవసరం లేకుండా ఊహాశక్తికి తగినట్లుగా పూర్తి స్థాయి సినిమాను తెరకెక్కించే వెసులుబాటును ఈ ట్రెండ్ కల్పిస్తోంది. ప్రేక్షకులు కూడా ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే కాకుండా పరిపూర్ణ సినిమా అనుభూతిని కోరుకుంటున్నారనడానికి సుదీర్ఘ చిత్రాల భారీ విజయమే తిరుగులేని నిదర్శనంగా భావిస్తున్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com